RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

09 జూలై 2025 బుధవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:35







**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** నాంపల్లి గాంధీభవన్‌లో ఆషాడమాస బోనాల పండుగ సందర్భంగా తెలంగాణా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బోనాలు అమ్మవారికి సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత రావ్ మహిళా కాంగ్రెస్ నాయకురాల్లు పాల్గోన్నారు.ముఖ్య అతిధిగా పీసీసీ అధ్యక్షులు మహేష్‌కూమార్ గౌడ్ ,కె.వి.పి. రాంచంద్రరావు పాల్గోన్నారు.

# కాంగ్రెస్ అరాచక పాలన తో

## రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు-కేటీఆర్



వార్తా 2 లో

# జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించండి..

**వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక సహాయం చేయండి...**

**హైదరాబాద్-బెంగళూరు ఏరో-డిఫెన్స్ కారిడార్ మంజూరు చేయండి..**

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి**



ఢిల్లీ: జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (NICDIT) ఆమోదించిన రూ.596.61 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్ లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం అభ్యర్థించారు. హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేసిందని... ఈ నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరో-డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గోయల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబం ఢిల్లీకి లిక్కర్ దందా కోసం పోయారు

## ఎరువులు.. నిధుల కోసం..నీళ్ల పంచాయతీ కోసం ఢిల్లి పోయాడు రేవంత్

## జగ్గారెడ్డి





కేటీఆర్ ఈ మధ్య తెలంగాణ లో ఉండటం లేదు నెలకోసారి విదేశాల్లో ఉంటున్నాడు
.నెలలో పది రోజులు ఇక్కడ... 20 రోజుకు విదేశాల్లో ఉంటాడు కాబట్టి సీఎం రేవంత్ షెడ్యూల్ తెలియదు
. విదేశాల్లో తిరిగే కేటీఆర్ కి.. సీఎం రేవంత్ ఏం చేస్తున్నది ఎందుకు తెలుస్తుంది.
. పదేళ్లు మంత్రిగా నువ్వు... సీఎం గా మీ నాయన చేశాడు .
ఢిల్లీకి ఎందుకు పోతారో అనే ఇంగిత ్ఞనం లేదా..? కేటీఆర్
ఎరువులు.. నిధుల కోసం..నీళ్ల పంచాయతీ కోసం ఢిల్లి పోయాడు రేవంత్
కేసీఆర్ కుటుంబం ఢిల్లీకి లిక్కర్ దందా కోసం పోయారు
హరీష్ కేటీఆర్ లు... ఈడీ ఆఫీస్ ల కోసం డిల్లీ వెళ్ళారు
మా సీఎం రేవంత్ కేంద్రం చుట్టు తిరుగుతున్నారు మీ తిరుగ ఈడీ చుట్టూ తిరుగుతున్నాడా..?
కేటీఆర్ కి సిస్టర్ స్ట్రోక్ తగిలింది
కాంగ్రెస్ కి పుట్టినిల్లు డిల్లీ.. మీ లాగా మాది గల్లి పార్టీ కాదు కదా?
కేటీఆర్..నీ స్ట్రోక్ ల లొల్లి మాకెందుకు రుద్దుతున్నావు
కేటీఆర్.. కేసీఆర్ కోటా లో డైరెక్ట్ %ఎశ్రీఖ% అయిపోయాడు
రాజకీయ ఒడిదుడుకులు నీకేం తెలుసు..?
సన్నాసులు అనే మాటలు స్టార్ట్ చేసింది మీ అయ్యా నే
మీరు తిట్టిన మాటలను కాస్త పాలిష్ చేసి తిడుతున్నారు
మేము సత్రం నడపడం లేదు.. మీరు తిడితే మేము తిడతం
రేవంత్ నీ గోకుడు ఎందుకు తన్నించుకోవడం ఎందుకు..?
తిట్ల పురాణం మీదే.. మీరు ఒకటి అంటే మీరు పది తిడుతున్నాం
అమెరికాలో చదివి.. పదేళ్లు మంత్రి అయినవి... చర్చ అసెంబ్లీ లో చేయాలా..?
కల్లు కాంపౌండ్ లోకి రా అంటే ఎట్లా ..?
బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పు చేస్తుంది అని కేటీఆర్ ఒప్పుకున్నాడు
వెయ్యి కోట్లు... పక్క రాష్ట్రాల ఎన్నికల్లో పంపింది కేసీఆర్ కుటుంబం
దాని గురించి మాట్లాడే హక్కు కేటీఆర్ కి లేదు
కేటీఆర్...అబద్దాల కోరు
అందరికీ వడదెబ్బ తగిలితే.. ఫ్యామిలీ దెబ్బలు తగులుతున్నాయి
కేటీఆర్ కి అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు
కేటీఆర్ విదేశాల్లో చల్లదనం కోసం పోతున్నారు
నెలలో 20 రోజుల్లో విదేశాల్లో కేటీఆర్ కి ఏం పని చెప్పు
కేటీఆర్.. మీరు ఒక్క బూతు మాట్లాడితే.. సీఎం రేవంత్ పది తిడతాడు
నువ్వు బూతులు మాట్లాడటం బంద్ చెయ్.. రేవంత్ కూడా బంద్ చేస్తారు
ఈ విషయంలో మా లైన్ క్లియర్
పదేళ్లు కేటీఆర్..ఏం పీకిండు.. 18 నెలలు పవర్ లేకుండా పోయే సరికి..
నీళ్లలో చేప ఒడ్డున పడ్డట్టు గిల గిల కొట్టుకుంటున్నాడు
ఇందిరమ్మ పాలన పై వేలు పెట్టే హక్కు హరీష్ కి లేదు
మీరు పదేళ్లలో కొందరు %ఎఱ..ంజూ..ంజూ% లను అడ్డం పెట్టుకుని మమ్మల్ని వేధించారు
.నాపై కూడా నిఘా పెట్టారు
జగ్గారెడ్డి ఎక్కడ దొరుకుతడా..? అని చూశారు
మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి నాపై నిఘా ఇంచార్జి
పోలీసుల నిఘా లో తేలింది అప్పులే తప్పా..ఆస్తులు లేవు అని తేల్చారు
. భూముల పంచాయతీ ఉందా అని అప్పటి కలెక్టర్ రోనాల్డ్ రాస్ ను విచారణ చేయించారు
ఎక్కడ దొరక్కా... పాస్ పోర్ట్ కేసు పెట్టారు
రేవంత్..నాక్కూడా ఆరు నెలల క్రితమే నిన్ను అరెస్ట్ చేస్తారు జగ్గన్న అని చెప్పారు
పాస్ పోర్ట్ కేసులో కేసీఆర్ కుటుంబమే మూలం
.నేను రివెంజ్ తీర్చుకోవాలి అనుకుంటే..హరీష్ హైదరాబాద్ లో తిరగడు
పాస్ పోర్టు కేసు తిరగ తోడు అని సీఎం రేవంత్ వెంట పడేటాన్ని కాదా..?
కేటీఆర్.. మళ్ళీ వస్తా అంటే నేను వస్తా..?
కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్.. నేను వర్కింగ్ ప్రెసిడెంట్
కేటీఆర్ సెకండ్ బెంచ్ స్టూడెంట్
కేసీఆర్..రేవంత్ ఫస్ట్ బెంచ్ స్టూడెంట్ లు..
కేసీఆర్ సవాల్ విసిరి చర్చకు రా...అంటే రేవంత్ నీ నేను ఒప్పిస్త
కేటీఆర్..హరీష్ లు ఏ క్లబ్ కి రమ్మన్నా.. నేను వస్తా
నువ్వు సెకండ్ బెంచ్ .. నేను సెకండ్ బెంచ్ స్టూడెంట్స్.. మనం మనం చూసుకుందాం
కేసీఆర్ సవాల్ విసిరితే..రేవంత్ వస్తారు.. నేను ఒప్పిస్త
ఒక 420..మమ్మల్ని 420 అంటున్నాడు
నువ్వు కంట్రోల్ లో ఉండు.. మా వాళ్ళు కంట్రోల్ లో ఉంటారూ

# రైతు భరోసా, మహిళలకు వడ్డీ లేని రుణాలు, తదితర ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వం

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిమల్లు బట్టి విక్రమార్క**

**పేదవాడి సొంత ఇంటి కల సహకారం చేయడం కోసం ఇందిరమ్మ పథకం అమలు చేస్తున్నాం**

**భూ సమస్యలు పరిష్కారానికి నూతన రెవెన్యూ చట్టం అమలు**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**





వార్తా 2 లో

# ప్రజాబలం

09 జూలై 2025 బుధవారం


# సర్కారుబడిని సరిచేసుకోలేమా?

తమ పిల్లలకు 'మంచి' చదువు చెప్పించాలనే తల్లిదండ్రుల ఆరాటం కాస్తా విద్యావ్యాపారానికి దారితీస్తున్నది. నాణ్యమైన విద్య కావాలనే వారి తపనను తప్పుపట్టలేం. కానీ, ఇక్కడ గమనించాల్సింది చదువులేని లేదా అరకొర చదువులతో చట్టబండలైన తమ బతు కుల్లా కాకుండా, సగం కడుపు మాడ్చుకొనైనా, నెలనెలా ఫీజుకు కష్టమైనా సరే తమ పిల్లలను చదివించుకోవాలనే నిర్ణయం ప్రయివేటు యాజ మాన్యాల విద్యావ్యాపారానికి ఊతంగా మారాయి. తల్లితండ్రుల ఆశలే కార్పొరేట్ల దోపిడీ మార్గాలయ్యాయి. అయితే ఇక్కడ మనం చూడా ల్సింది సర్కార్ విధానాలే. చదువు 'రాజ్యం' బాధ్యత కదా! మరి పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తే.. 'మేం చేయలేనిదేముంది. గ్రామాలు, ఆవాసాలు అన్ని చోట్లా బడులు పెట్టాం. గురుకులాలు కూడా ప్రారంభించాం. దుస్తులు, పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అన్నీ సమకూర్చుతున్నాం' అనే సమాధానం లభిస్తుంది. మరి ఇలాంటి ప్రభుత్వ స్కూళ్లు ఇన్ని ఉన్నప్పుడు ప్రయివేటు అవసరమేమిటి? ప్రభుత్వ బడుల్లో పిల్లలు బోలోమని చేరడంతో పూర్తిగా నిండిపోయి కొత్తగా చేర్చుకోవడం లేదా? అంటే అదేం లేదు! రాష్ట్రంలో ఈరోజు విద్యార్థులు లేని పాఠశాలలు 1980 ఉండగా, ఉపాధ్యాయుల చొరవతో ఈ విద్యాసంవత్సరం అందులో 140 పాఠశాలలు తిరిగి ప్రారంభించబడినవి. బడైతే పెట్టారు కానీ దానిపట్ల తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పాదుకొల్పలేకపోయారు పాలకులు. ఈ నమ్మకం సన్నగిల్లడానికి కారణాలు చాలానే ఉన్నాయి. బడి భవనం ఉన్నా దాన్ని రోజూ ఊడ్చే వారుండరు. అటెండరు కానరారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం అంతకన్నా ఉండవు. పాఠశాల మూసిన తర్వాత పట్టించుకునేందుకు వాచ్‌మెన్ లాంటి నాధుడే కనపడడు. మరుసటిరోజు వచ్చేసరికి పాఠశాల ఆవరణ ఎలా ఉంటుందో చెప్పలేని సందర్భాలనేకం. ఎందుకంటే ఆబడి ఊరు ఉమ్మడి ఆస్తికదా! సబ్జెకు టీచర్ల కొరత సరేసరి. పదేండ్ల కాలం ప్రధానో పాధ్యాయులు, మండల విద్యాధికారులు లేకుండానే పాఠశాల విద్యను ఈడ్చు కొచ్చారు. నేటికీ మొత్తం 625 మండలాలకుగాను 606 మండ లాల్లో ఎంఈఓలు లేరు. 58 ఉపవిద్యాశాఖాధికారుల పోస్టులు ఖాళీగా పడి ఉన్నాయి. 33 జిల్లాలకుగాను 12 పూర్తిస్థాయి డిఈఓ పోస్టులు మాత్రమే ఉన్నాయి. గొప్పలు చెప్పుకున్న గురుకులాలన్నీ అద్దె భవనాల్లో ఇరుకు గదుల ఫ్లాట్లలో, పిల్లల మాటల ప్రతిధ్వనుల మధ్య కొనసాగు తున్నాయి. అనేక తంటాలు పడుతూ నెట్టుకొస్తున్నారు ప్రిన్సిపాళ్లు, టీచర్లు. ప్రభుత్వ బడి అంటే విశ్వాసం లేనిదిగా మారడానికీ కారణాలు చాలవా? ఇవన్నీ ఎలా ఉన్నా సమాజానికి కనిపించేది ఉపాధ్యాయులే. అపవాదు అంతా వారిపైతోసే ప్రయత్నమూ తక్కువేం కాదు! దీని వెనుక కార్పొరేట్ల ప్రోద్బలం సహజంగానే ఉంటుంది. టీచర్ల పిల్లలే మా బడిలో చదువుతున్నారంటూ విద్యావ్యాపారులు చేసే ప్రచారం మా మూలుగా ఉండదు. అం తెందుకు కార్పొరేట్ విద్యాసంస్థల అధిపతులే ప్రభుత్వ విద్యను కాపాడే ప్రతినిధులుగా చట్టసభలకు ఎన్నికై శాసనాలు చేసే స్థాయికి ఎదిగారు.

ఏదేమైనా 'బడిని బతికించుకోవడం' పౌరసమాజం బాధ్యత. అందులో టీచరు కూడా భాగస్వామి. అందుకే నేడు రాష్ట్ర వ్యాప్తంగా వేసవి సెలవుల్లో సైతం ప్రగతిశీల కాముకులైన ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా విద్యార్థుల నమోదు పెంచేందుకు జాతాలు నిర్వహిం చారు. తెలంగాణ రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మే 25 నుండి జూన్ 5 వరకు గ్రామగ్రామాన సభలు సమావేశాలు ఏర్పాటు చేశారు. తల్లితండ్రులకు, ప్రజలకు 'బడి అంటే ముందు మేము, పిల్లలమేకదా!' 'మీ పిల్లల చదువుకోసం మేమున్నాం.' వారు చదువుకునే ఈ బడికేం కావాలో, ఈ బడిలో ఏం ఉండాలో చెపుతాం. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చివాటిని సాధించుకుందాం! నాణ్యమైన చదువెందుకుండదు? మేమంతా ఇలాంటి బడుల్లోనే కదా! చదువుకున్నది అని చెపుతూ విశ్వాసాన్ని పెంచే ప్రయత్నం చేశారు. 'తెలంగాణ పౌరస్పందన వేదిక' లాంటి ప్రజా సంఘాలు విద్య, వైద్యం, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండాలని ప్రచార జాతాలు, తల్లితండ్రులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. సర్కారు బడిపట్ల సానుకూలతను పెంచుతూ గ్రామస్తుల్లో సమిష్టిగా ఊరిబడిని కాపాడుకోవాలనే తపనకై కృషి చేస్తున్నారు.

పాఠశాల విద్యకుచేసే కేటాయింపులు భవిష్యత్ అభివృద్ధి కోసం వెచ్చించే పెట్టుబడిగా భావించనంత కాలం పరిస్థితుల్లో మార్పు ఆశించడం కష్టమైన పనే. గత ప్రభుత్వం దాదాపు పదేండ్లకాలం ముఖ్యమంత్రి స్థాయిలో విద్యారంగంపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేయ లేదంటే, ప్రభుత్వ విద్యపట్ల పాలకుల నిబద్ధతకు ఇంతకు మించిన కొలమానం ఇంకేముంటుంది? అందుకే బడ్జెటుతో పాటు పాలకవర్గ చిత్తశుద్ధి అంతే ముఖ్యం. అసలు ఉన్న పరిస్థితుల్లోనే ఏం చేయగలమనేది నిర్ణయించి తక్షణ అమలు ప్రారంభించాలి. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక విద్యా సంవత్సరం గడిచిపోయి, రెండోది ప్రారంభమైంది. గతేడాది ఏం జరగలేదా, కొత్త ప్రభుత్వం ఏం చేయలేదా అంటే పదోన్నతులు, బదిలీలు ఉపాధ్యాయుల్లో ఉన్న అశాంతిని కొంతమేరకు దూరం చేసినా, అసలు సమస్యలపై కేంద్రీకరించ లేదనే చెప్పాలి.

ఒక రోజంతా శాసన మండలిలో విద్యపై పూర్తిస్థాయి చర్చ చేయడం, విద్యాకమిషన్ ఏర్పాటు చేసి మౌలిక మార్పులపై సిఫారసులు కోరడం ఆహ్వానించ దగ్గ చర్యే. అయితే ఫలితాలిచ్చే పని మొదలు కావడానికింకా సమయం కావాలంటే ఆత్రం నిర్లిప్తత, ఉదాసీనతకు గురైన విద్యారంగాన్ని ఆ పరిస్థితులనుండి బయటపడేసేందుకు, సరిచేసేందుకు ఒక ప్రభుత్వాని కుండే ఐదేండ్ల కాలంలో గడిచిన ఏడాదిన్నర కాలం తక్కువేమీ కాదు! జరిగే జాప్యానికి కారాణలేవైనా గత పాలకులకు ప్రస్తుత ప్రభుత్వానికి తేడా పెద్దగా ఏముంది?అని చెప్పుకునేందుకు ఆస్కార మిచ్చినట్లవు తుంది. కీలకమైన ఉపాధ్యాయ విద్యనందించే కళాశాలలు అధ్యాపకుల ఖాళీలతో కునారిల్లి పోతు న్నాయి. రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ (యస్‌సిఈ ఆర్‌టి) డిప్యుటేషన్లకు నిలయంగా మారింది. డైట్, జూనియర్ కళాశాలల్లో, దశాబ్ద కాలంగా ఖాళీలు కొనసాగుతున్నాయి. ఉప విద్యాశాఖాధికారులు లేనేలేరు. కొత్త మండలాలకు ఎంఈఓలు, జిల్లాలకు డీఈఓ పోస్టులు మంజూరు కావాల్సి ఉంది. 2000 స్కూల్ అసిస్టెంట్స్, ఏడువేల ఎస్జీటీ ఖాళీలున్నాయి. ఇలాంటి సమస్యల సుడిగుండంలో కూడా సగటు ఉపాధ్యాయుడు బడి బాధ్యత నాదే అని భావించడం అత్యంత ప్రధానం. ఇది సమాజం పట్ల రేపటి పౌరుల భవిష్యత్తు పట్ల ఉపాధ్యాయులకున్న బాధ్యతకు నిదర్శనం. నేడు అనేకచోట్ల ఉపాధ్యాయులు స్వచ్ఛం దంగా బడికోసం అవసరమైన డబ్బులు సైతం వెచ్చించి నిధులు సేకరించి, వేసవి సెలవులన్నీ వినియోగించి బడిబాగు కోసం కృషి చేస్తున్నారు. ఫలితంగా ఇప్పటికే కొన్ని చోట్ల విద్యార్థుల నమోదు పెరిగి 'నో అడ్మిషన్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. గతంలో మూసివేయబడ్డ బడులను పూర్వ విద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో తిరిగి ప్రారంభిస్తున్నారు. విమర్శలకు సమాధానంగా మా పిల్లలను మా పాఠశాలలోనే చదివించు కుంటామని కొందరు ఉపాధ్యాయులు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇలాంటివెన్ని చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నపుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. పాలకులు కేవలం ఎన్నికల కోసం ఆకర్షణీయ హామీలుగా కాకుండా నిర్దిష్ట చర్యలతో ముందుకెళ్లాలి. మాటలతో కాలం వెళ్లదీయకుండా ఆ వెంటనే మొదటి అడుగుపడాలి. సాధించిన ఫలితాలు, మెరుగైన పరిస్థితులు రాబోయే కాలంలో తమ రాజకీయ లక్ష్యానికి తోడవుతాయని, విద్యారంగానికి పెట్టే ఖర్చు సమాజం భవిష్యత్తుకు బాటవేస్తుందని, దేశ రాజకీయ భవిష్యత్తు సైతం అందులో ఇమిడి ఉంటుందనే

## కాంగ్రెస్ అరాచక పాలన తో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు-కేటీఆర్






ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఆత్మహత్యలు చేసుకున్న 600 మంది అన్నదాతల కోసం ఒక నిమిషం మౌనం పాటించిన బీఆర్ఎస్ నేతలు

గత 18 నెలల నుంచి తెలంగాణలో సాగుతున్న కాంగ్రెస్ అరాచక పాలన తో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు-కేటీఆర్

నోటికొచ్చిన హామీలు, నోటికి వచ్చిన వచ్చిన వాగ్దానాలు, 420 హామీలు, వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు అని డైలాగులు కొట్టి గత 18 నెలలుగా రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులను, కోట్లాది కుటుంబాలను కాంగ్రెస్ దగా చేసింది.

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలుకు మాది గ్యారంటీ అని బాండ్ పేపర్ మీద రాసి గద్దెనెక్కి 18 నెలల తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని కూడా రేవంత్ రెడ్డి నెరవేర్చలేకపోయాడు.

తెల్లారి లేస్తే అరుపులు, గావుకేకలు, బూతులు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదు.

తెలంగాణ రైతాంగానికి, యువతకు ఎవరేం చేశారో తేల్చుకుందాం రమ్మని ముఖ్యమంత్రి గారు విసిరితే స్వీకరించి నేను వచ్చాను. బేసిన్ నాలెడ్జి లేని రేవంత్ రెడ్డికి బేసిక్ నాలెడ్జి లేదని తెలిసినా కూడా ముఖ్యమంత్రి ముచ్చట పడుతున్నాడు కదా అని సవాల్ ను స్వీకరించాను.

బేసిన్ నాలెడ్జ్ , బేసిక్ నాలెడ్జ్ లేదు కాబట్టే ఓ 72 గంటల టైం ప్రిపరేషన్ కోసం ఇచ్చి రమ్మన్నాను. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని చెప్పాను.

జులై 8 తారీఖున 11 గంటలకు మేమే ప్రెస్ క్లబ్ కు వస్తాము, మీడియా సాక్షిగా, ప్రజల సాక్షిగా చర్చిద్దామంటే ఇవాళ రేవంత్ రాకుండా ఢిల్లీకి పోయిండు.

ఒకవేళ ముఖ్యమంత్రి రాలేకపోతే ఆయన తరపున బాధ్యత గల ఉప ముఖ్యమంత్రి గాని, వ్యవసాయ మంత్రి గానీ, లేదంటే ఇంకెవరైనా మంత్రులను పంపుతారని అనుకున్నా.

కానీ రేవంత్ రెడ్డికి రచ్చ చేయడమే వచ్చు కాని చర్చ చేయడం రాదని ఇవాళ తేలిపోయింది.

రేవంత్ రెడ్డికి బూతులు మాట్లాడడం వస్తుంది కానీ రైతుల గురించి మాట్లాడడం రాదని స్పష్టంగా తెలిసిపోయింది.

రేవంత్ రెడ్డికి బేసిన్ ల గురించి కూడా బేసిక్ నాలెడ్జ్ లేదు. ఏ ప్రాజెక్టు బేసిన్లో ఉంది అని ఇరిగేషన్ అధికారులను ఒక చిన్న పిల్లాడు అడిగినట్లు అడుగుతుంటే ఇతనా మనకు న్యాయం చేసేదని రాష్ట్రంలోని రైతులు బాధపడుతున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ గారు , కేసీఆర్ గారు తెలంగాణ ఉద్యమానికి నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ప్రాతిపదికను కల్పించారు.

ఈ సిద్ధాంతాన్ని తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి వాడుతున్నాడు.

తెలంగాణ రైతులకు సున్నం పెడుతూ, తెలంగాణ రైతులను మోసం చేస్తూ ఆయన గురువు చంద్రబాబుకు కృష్ణా గోదావరి నీళ్లను పంపిస్తున్నాడు. కింద గోదావరిలో బనకచర్ల కడుతుంటే పచ్చ జెండా ఊపుతున్నడు.

పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా నీళ్లను దొంగ చాటుగా తీసుకెళ్తుంటే కళ్ళు మూసుకొని చంద్రబాబు చెప్పినట్టు కోవర్టు పాలన సాగిస్తున్నాడు.

నీళ్లేమో ఆంధ్రకు పోతున్నాయి. నిధులు ఢిల్లీకి పోతున్నాయి. తన తొత్తులకు నియామకాలు ఇచ్చుకొని రేవంత్ మురిసిపోతున్నాడు.

కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు పైసల మూటలు మోసి రేవంత్ తన పదవిని కాపాడుకుంటున్నాడన్న సంగతి ఇవాళ తెలంగాణలోని చిన్న పిల్లలకు కూడా తెలుసు.

తెలంగాణ సోషల్ మీడియాలో రేవంత్ రెడ్డికి పేసిఎం అని పేరు పెట్టారు.

రాష్ట్రంలోని ఏ వర్గానికి రేవంత్ రెడ్డి మేలు చేయలేదు.

రైతు భరోసాలోని డొల్లతనాన్ని చెబుదామని అధికారిక సమాచారంతో వచ్చా

స్వయంగా ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో రైతు భరోసా రాని 670 మంది రైతుల పేర్లు, అడ్రస్సులు, ఫోన్ నెంబర్లతో సహా తీసుకొని వచ్చాను.

రాష్ట్రంలో రుణమాఫీ కానీ లక్షల మంది వివరాలతో జాబితా తీసుకొచ్చాను.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయం చేయలేక ఆత్మహత్యలు చేసుకున్న 670 మంది రైతుల వివరాల మా దగ్గర ఉన్నాయి.

రాష్ట్రంలో బోనస్ రాక పంటలు అమ్ముకునే దిక్కు లేక ప్రభుత్వం కొనక మిల్లర్లకు అమ్ముకొని నష్టపోయిన రైతుల జాబితాను తీసుకొని వచ్చా.

ఇవాళ రాష్ట్రంలో ఎరువుల కొరత రైతులను సతమతం చేస్తున్నది. ఒక్క ఆధార్ కార్డుతో ఒక ఎరువుల బస్తా, యూరియా బస్తా ఇస్తామంటే చెప్పులను క్యూలో పెట్టి రైతులు ఫర్టిలైజర్ దుకాణాల ముందు ఎదురుచూస్తున్నారు.

మళ్లీ ఆనాటి రోజులు తీసుకొస్తామని చెప్పిన కాంగ్రెస్ నిజంగానే ఆ పాత దుర్దినాలను తీసుకొచ్చింది కరెంటు కోతలు, ట్రాన్స్ఫార్మర్లు పేలిపోయే ఆనాటి రోజులు మళ్లీ ఇప్పుడు వచ్చాయి. ఎరువులు, విత్తనాల కోసం లైన్లో నిలబడే ఆనాటి రోజులు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఇందిరమ్మ రాజ్యం అంటే సంక్షేమ రాజ్యం అనుకున్నారు ప్రజలు. కానీ ఇందిరమ్మ రాజ్యం అంటే అక్రమ కేసులు, అణిచివేతలు, నిర్బంధాలు అని తెలుసుకన్నారు. 50 ఏళ్ల క్రితం విధించిన ఎమర్జెన్సీ ని తలపించేలా ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతుంది.

పేదలు, గిరిజనులు, దళితుల మీద దాడులు చేస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టును రీ ట్వీట్ చేసినందుకు నల్లబాలు అనే బహుజన బిడ్డను రేవంత్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసింది.

ఇందిరమ్మ రాజ్యం అంటే ఏందో ప్రజలకు అర్థమైంది.ఆనాటి రోజులు ఎలా ఉంటాయో ఇప్పుడు చూస్తున్నారు. మార్పు అంటే ఇంత దారుణంగా ఉంటుందా అని చర్చించుకుంటున్నారు.అందుకే రేవంత్ రెడ్డికి కర్రు కాల్చి వాత పెట్టడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

మాజీ మంత్రులు, మాజీ హోంమంత్రి, మాజీ అడిషనల్ డీజీపీ ఇంకా ఎందరో బీఆర్ఎస్ నేతలు, నాయకులు, ఎంపీలు, అందరు ముఖ్యమంత్రి గారి కుర్చికి చాలా గౌరవాన్ని ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి ఆ గౌరవాన్ని నిలుపుకునేలా లేడు. ఆయన చేప్పే పిచ్చి మాటలు, చేసే రోత చేష్టలను తెలంగాణ సమాజం గమనిస్తోంది.

కెసిఆర్ గారిని ప్రతిరోజు ఎలా తిడుతున్నారో ప్రపంచమంతా చూస్తోంది.

2018 లోనూ కొడంగల్లో రాజకీయ సన్యాసం తీసుకుంటారని సవాల్ విసిరిండు కానీ ఆ తర్వాత మాట మార్చి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిండు.జిహెచ్ఎంసి లో బీఆర్ఎస్ సొంతంగా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాట తప్పిండు. ఇవాళ కూడా తొడగొట్టిండు. సవాల్ విసిరిండు. పారిపోయిండు.

చర్చకు రమ్మని స్వయంగా ముఖ్యమంత్రే పిలిస్తే నేను వచ్చిన. కాని ఇప్పుడు ఆయనే పత్తా లేకుండా పారిపోయిండు.

రైతు శ్రేయస్సు మీద, యువతకు ఇచ్చిన ఉద్యోగాల మీద చర్చ అంటే సమగ్ర సమాచారంతో మేము వచ్చాము.

ముఖ్యమంత్రి చాలా బిజీగా ఉంటారు. అందుకే ఆయనకు మరొక అవకాశం ఇస్తున్నాను. ప్లేసు, డేటు ,టైము, మీరు డిసైడ్ చేయండి. జూబ్లీహిల్స్ ప్యాలెస్ కు రమ్మంటే కూడా వస్తాము. ఏ అంశం మీద చర్చ పెట్టినా చర్చించడానికి కెసిఆర్ తయారుచేసిన గులాబీ దండు సైనికులం తయారుగా ఉన్నాం. సోషల్ మీడియాలో పిల్లలు పోస్టులు పెడితేనే రేవంత్ రెడ్డి గజ గజ వణికిపోతున్నాడు. వాళ్ళని తీసుకెళ్లి జైల్లో పెడుతున్నాడ. ఆయనకు కేసిఆర్ కావాలా? రేవంత్ రెడ్డికి కెసిఆర్ అవసరం లేదు.

నేనే కాదు మా పార్టీలో ఏ నాయకుడైనా రేవంత్ రెడ్డికి సరిపోతారు.

కానీ ఆయన ముచ్చటపడి పేరు తీసిండని నేను వచ్చాను. మైక్ ఇవ్వకుండా అసెంబ్లీలో టైం పాస్ చేస్తానంటే ప్రజలు అన్ని గమనిస్తున్నారు.

చర్చకు రాలేక పోతే ముక్కు నేలకు రాసి కెసిఆర్ కి క్షమాపణ చెప్పు. తప్పుడు కూతల కూసినందుకు, రైతుబంధు, రైతు భీమా లాంటి పథకాన్ని తెచ్చిన మహా నాయకుడు కేసీఆర్ ను, భారత దేశ చరిత్రలో మొట్టమొదటిసారి 24 గంటలు రైతుకు ఉచితంగా కరెంటు ఇచ్చిన కేసీఆర్ ను అడ్డగోలుగా తిట్టినందుకు ముక్కు నెలకు రాయాలి.

చర్చకు వచ్చే దమ్ము లేదు. కేవలం నాకు రచ్చ చేయడం మాత్రమే తెలుసు అని చెప్పి క్షమాపణ చెప్పు. అంతేగాని ఇలాంటి పనికిమాలిన సవాళ్లు పనికిమాలిన డైలాగ్లు ఇంకొకసారి చెప్పకు..

## దేశంలో ఎక్కడా లేనివిధంగా పేద ప్రజల కోసం సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిమల్లు బట్టి విక్రమార్క

మంగళవారం మహబూబాబాద్ జిల్లా సోమ్లాతండ,గ్రామపంచాయతీ కేసముద్రం మున్సిపాలిటి పరిధిలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనల కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య,వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, ట్రై కార్ చైర్మన్ బెల్లాయ నాయక్, తదితరులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,

మహబూబాబాద్ పరిధిలో (07) పనులకు గాను అంచనా వ్యాయం 71.43 కోట్ల తో రహదారులు, పురపాలక పట్టణ అభివృద్ధి, ట్రైబల్ వెల్ఫేర్, నూతన సబ్ స్టేషన్ నిర్మాణం, శంకుస్థాపనలు,

కేసముద్రం పరిధిలో (36) పనులకు గాను అంచనా వ్యాయం 223,35 కోట్లతో కేసముద్రం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ భవన నిర్మాణం, అంగన్వాడీ కేంద్రం, రహదారులు, భవనాల శాఖ, పట్టణంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం 12 కోట్ల రూపాయలు మంజూరు, తెలంగాణ ట్రాన్స్మిషన్ నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం, సీసీ రోడ్లు కల్వర్టులు అంతర్గత అభివృద్ధి పనులు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, నూతన గిడ్డంగుల నిర్మాణం, దేవాదాయ శాఖ ఆలయాల అభివృద్ధి పనులు, తదితర శంకుస్థాపనలు చేశారు,

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ, జిల్లాలోని స్వయం సహాయక 11263, గ్రూపులకు 2129. లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేశారు,

మహబూబాబాద్ శాసనసభ సభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ

దేశంలో ఎక్కడా లేనివిధంగా పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూ యావత్తు ప్రపంచం ఇందిరమ్మ రాజ్యం తెలంగాణ రాష్ట్రం వైపు చూస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, రైతు భరోసా, రుణమాఫీ, వడ్డీలేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ పథకం అమలు నిధుల పెంపు, ప్రభుత్వ పాఠశాలలో కాస్మోటోకి చార్జీల పెంపు, నూతన డైట్ మెనూ అమలు, త్రాగునీరు, సాగునీరు, తదితర అనేక పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు,

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదవాడి సొంత ఇంటి కల సహకారం చేయడానికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకం ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని, భూ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వంలో ధరణి ద్వారా అనేక ఇబ్బందులు పడ్డారని ప్రస్తుత ప్రభుత్వం నూతన భూభారతి రెవెన్యూ చట్టం అమలు చేసి ప్రతి ఒక్కరి భూ సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేస్తుందని అన్నారు, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు,

జిల్లాలోని నారాయణపురం, సీతానగరం, పంతులు తండా లలో ఉన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా యంత్రంగానికి ఆదేశాలు జారీ చేశారు,

కేసముద్రం సభ వేదిక ప్రజా పాలనలో ప్రగతి బాట సభలో రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన విస్తృతంగా సాగుతుందని 9 రోజుల్లోనే 9000 కోట్ల రైతు భరోసా అందించి రైతు సంక్షేమానికి పెద్ద పీత వేశమన్నారు.

గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో కేవలం 15 వేల కోట్ల రూపాయలు రైతులకు రుణమాఫీ చేస్తే మా ప్రభుత్వం 17 నెలల్లో 21 వేల కోట్ల రూపాయలను రుణమాఫీ చేసి చూపించమన్నారు. ఇక మహబూబాబాద్ నియోజకవర్గం అభివృద్ధిలో అహర్నిశలు పనిచేస్తున్న ఎమ్మెల్యే మురళి నాయక్ ఎంపీ బలరాం నాయక్ ముఖ్యమంత్రి సలహాదారులు ఈ రాష్ట్రంలో ఇందిరమ్మా పాలన ఏర్పడటానికి ముఖ్య భూమిక పోషించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెన్నంటి వుండిన నేత వేం నరేందర్ రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్నారన్నారు. రాష్ట్రంలో

ఏ నియోజకవర్గానికి ఇవ్వని విదంగా 200 కోట్ల రూపాయల నిధులతో రోడ్లన్నీ మంజూరు జరిగాయాన్ని

నేడు వ్యవసాయ ఉత్పత్తులకు అవసరం ఉన్న గిడ్డంగులను సుమారు 10 కోట్ల రూపాయలతో నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు.నేడు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క100 కోట్ల రూపాయలతో కేసముద్రం మండల కేంద్రంలో 133 కెవి సబ్ స్టేషన్ 3 33 కెవి సబ్ స్టేషన్ లు ఏర్పాటు చేసు న్నామన్నారు..

రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, దళసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, సభను ఉద్దేశించి మాట్లాడారు,

ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ ,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపుంతలు తొక్కుతున్న ప్రపంచ ఫ్యాషన్ టెక్నాలజీ

ప్రతి ఒక్కరు తమ ఫ్యాషన్ భావాలను వ్యక్తీకరించడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంటారు. ఒక్కొక్కరి వస్త్రధారణ ఒక్కో విధంగా ఉంటుంది. కులాలు, మతాలు, జాతులు, దేశాలు, ప్రాంతాలను బట్టి ఫ్యాషన్స్ మారుతుంటాయి. ఒక్కో జాతికి ఒక రకమైన విలక్షణ వస్త్రధారణ పద్ధతులు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచం, పరిశ్రమ చాలా పెద్దది. ఫ్యాషన్ టెక్నాలజీ క్షణక్షణం మారుతోంది. తరాలు మారిన కొద్దీ ఫ్యాషన్లు కూడా మారుతున్నాయి, కొన్ని సందర్భాల్లో వెర్రి పోకడలు కూడా సంతరించుకుంటున్నాయి. ప్రపంచ మానవాళి దృష్టిని తమ ఫ్యాషన్ల వైపుకు మరల్చడానికి, ప్రత్యేక సౌందర్య భావాలను వ్యక్తం చేయడానికి, వారి వారి విభిన్న దుస్తులు లేదా ఉపకరణాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ప్రతి ఏట 09 జూలై రోజున "అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డే)" పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది. ఫ్యాషన్ రంగం చాలా పెద్దది. నేడు ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమ/మార్కెట్ దాదాపు 1.84 ట్రిలియన్ డాలర్ల వ్యాపారంగా మారింది. ప్రపంచ మానవ జనాభా 8 బిలియన్లకు సాలీనా దాదాపు 100 బిలియన్ల వరకు దుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రతి ఒక్కరికి సగటున ఒక ఏడాదికి 12 – 14 దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. వస్త్ర ఉత్పత్తిలో అతి పెద్ద దేశంగా చైనా తొలి స్థానాన్ని ఆక్రమించింది. ఫ్యాషన్ పరిశ్రమ ద్వారా సృజన, ఆవిష్కరణ, సంస్కృతి, వేషధారణ, పలు రకాలు దుస్తులు, కేశాలంకరణ, అలంకరణ, ఆభరణాలు లాంటి పలు అంశాలు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచంలో వ్యక్తులు, డిజైనర్లు, క్రియేటర్స్, మోడల్స్, స్టైలిస్ట్స్, ఇన్నోవేటర్స్, ట్రెండ్స్, ఇన్ఫ్లుయెన్సర్స్ ద్వారా పలు రకాల ఫ్యాషన్స్ పుట్టుకొస్తున్నాయి, మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. నిన్నటి ఫ్యాషన్ నేడు పాతబడిపోయి, నేటి ఫ్యాషన్స్ కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. ఫ్యాషన్ అంటే దుస్తులు మాత్రమే కాదని, ఇది ఒక హద్దులు లేని వింత ప్రపంచమని అర్థం అవుతున్నది. ఫ్యాషన్ రంగం అంటేనే సృజనశీలత, ఆవిష్కరణ, సంస్కృతికి వైవిధ్యం, ప్రత్యేక గుర్తింపు లాంటి అంశాలకు పుట్టిళ్లు. సామాజిక మార్పులు, కళలకు అపూర్వ వేదికగా అంతర్జాతీయ ఫ్యాషన్ దినం ఉపయోగపడుతున్నది.

ఫ్యాషన్ డిజైన్ అంటే దుస్తులు, కొన్ని వస్తువులను అందంగా, వినూత్నంగా తీర్చి దిద్దే కళ అని తెలుసుకోవాలి. దీనిలో అవలంబించే పద్ధతుల సమాహారాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ అని పిలుస్తాం. మానవ అభిరుచులను బట్టి దుస్తులు, అలంకార వస్తువులను తయారు చేసే నిపుణులను ఫ్యాషన్ డిజైనర్స్ అంటాం. దుస్తులు, ఉపకరణాల రూపకల్పన, ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడాన్ని ఫ్యాషన్ టెక్నాలజీగా పిలుస్తున్నాం. ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైన్స్, వస్త్ర సాంకేతికత, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఫ్యాషన్ మార్కెట్, రిటైల్ లాంటి పలు రంగాలు ఉంటాయి. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్–సహాయ ఉత్పత్తి/డిజైన్స్, 3డి ప్రింటింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి పరిజ్ఞానాలు వాడబడుతున్నాయి. ఇవి ఫ్యాషన్ ప్రపంచ పరిశ్రమను మరింత సమర్థవంతంగా, సుస్థిరంగా, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆకర్షణీయంగా మార్చడంలో సహాయపడుతున్నది. ఆధునిక పౌర సమాజ అభిరుచులకు అద్దం పడుతున్నది నేటి ఫ్యాషన్ పరిశ్రమ. మారుతున్న కాలంతో పాటు ఫ్యాషన్లు కూడా అత్యంత వేగంగా మారుతున్నాయి. అంతర్జాతీయ ఫ్యాషన్ దినం వేదికగా ప్రదర్శనలు, పోటీలు, సామాజిక మాధ్యమ అవగాహనలు, నూతన బ్రాండ్ల ప్రదర్శనలు, డిస్కౌంట్స్, స్థానిక బ్రాండ్ల ప్రోత్సాహం, కొత్త బ్రాండ్ల ప్రారంభం, ఫ్యాషన్ టెక్నాలజీ సృజనకారుల గుర్తింపు లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. మానవ జాతి పుట్టుక నుంచి నేటి వరకు ఫ్యాషన్ రంగం కొత్తపుంతలు తొక్కుతూనే ఉన్నది. ఇదో వింత, విచిత్ర ప్రపంచం. పౌర సమాజంతో విడదీయరాని సంబంధం కలిగిన ఫ్యాషన్ ప్రపంచం నిన్నటి, నేటి, రేపటి తరాలకు తగిన విధంగా తమ ఉత్పత్తులను విడుదల చేస్తూనే ఉన్నాయి. ఫ్యాషన్ టెక్నాలజీ పెరగడం శుభ సూచకమే అయినప్పటికీ ఫ్యాషన్లు వెర్రితలలు వేయకూడదు, మన సాంస్కృతిక మూలాలను మరిచి పోకూడదు. మన ప్రాంత వాతావరణాన్ని, అవసరాలను, సందర్భాలను బట్టి మన వేషధారణ ఉండాలి. ఫ్యాషన్ పేరుతో అసహ్యకర రూపును పొందరాదని గమనించాలి.

# దేశాన్ని మింగుతున్న మత్తు విపత్తు

గంజాయి అనే మత్తు పదార్థం ఈ కాలంలో దేశాన్ని మానవీయ విపత్తుగా ముప్పతిప్పలు పెడుతోంది. గ్రామీణం గానీ, పట్టణం గానీ, పాఠశాలలైనా, కళాశాలలైనా, యువతీ యువకులైనా ... తేడా లేకుండా ఈ మత్తు మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. ఇది కేవలం ఒక మానసిక వ్యసనం కాదు. శారీరక ఆరోగ్యాన్ని, కుటుంబ పరిమితిని, సామాజిక సమతుల్యతను, ఆర్థిక స్థిరత్వాన్ని నాశనం చేసే భయంకరమైన వ్యాధిగా రూపుదిద్దుకుంది. గంజాయి అనేది "గంజి మొక్క" నుండి వచ్చే మత్తు పదార్థం. దీనిలో ప్రధానంగా ఉండే క్రియాశీల పదార్థం టెట్రా హైడ్రో. కానబినాల్, ఇది మెదడులోని స్వభావాన్ని ప్రభావితం చేస్తూ తాత్కాలిక ఆనందానుభూతిని కలిగించ గలదు. అయితే దీర్ఘకాల వాడకం వల్ల మానసిక అస్థిరత, భ్రమలు, నిస్పృహ, బహుళ వ్యక్తిత్వ లక్షణాలు, ఆందోళన, విపరీత భావోద్వేగాలు తలెత్తుతాయి. ఆరోగ్యపరంగా ఊపిరితిత్తుల సమస్యలు, గుండె వేగం పెరగడం, జీర్ణక్రియ మందగించడం వంటి శారీరక దుష్ప్రభావాలు కలుగుతాయి. 2021లో ఆఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ రూపొందించిన డ్రగ్ వినియోగంపై జాతీయ సర్వే ప్రకారం దేశంలో సుమారు 3.1 కోట్ల మంది కనీసం ఒక్కసారి గంజాయి వాడినట్లు తేలింది. ఇందులో దాదాపు 70 లక్షల మంది గంజాయికి బానిసలుగా మారిన వారే. పట్టణాల్లో మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి వినియోగం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా 15 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు కల యువత దీనికి బలవుతున్నారు. గంజాయి వినియోగానికి ప్రధాన కారణాలలో ఒకటి – సులభ లభ్యత. దేశంలోని ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల ఏజెన్సీ ప్రాంతాలలో విస్తృతంగా సాగవుతోంది. అక్కడినుండి ఇది దేశ వ్యాప్తంగా అక్రమంగా రవాణా అవుతోంది. ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో కళాశాలలు, పబ్‌లు, పార్టీలు గంజాయి విక్రయాలకు కేంద్రాలుగా మారిపోయాయి. యువతలో స్నేహితుల ఒత్తిడి, సరదా ప్రయోగం అనే పేరుతో మొదలై, వ్యసనంగా మారుతోంది. నిరుద్యోగం, కుటుంబ కలహాలు, ప్రేమ విఫలాలు వంటి మానసిక ఒత్తిళ్లు కూడా గంజాయి వైపు నెట్టేస్తున్నాయి. అంతేకాదు, "గంజాయి హానికరం కాదు", "ఇది ఆయుర్వేద మందు" అనే తప్పుడు ప్రచారాలు కూడా యువతను ఈ మత్తులోకి తొక్కిస్తున్నారు. ఈ మత్తు పదార్థం ప్రభావం కేవలం వ్యక్తిగత స్థాయిలో కాకుండా కుటుంబానికి, సమాజానికి తీవ్రంగా విస్తరిస్తోంది. గంజాయి వాడకం వల్ల పాఠశాల విద్యార్థులలో చదువుపై ఆసక్తి తగ్గిపోతోంది. తరచుగా గైర్హాజరు అవుతూ చివరికి చదువు మానేస్తున్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత కోల్పోవడం, మానసిక స్థిరత్వం కోల్పోవడం వలన ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. నేరాల శాతం పెరుగుతోంది. గంజాయి కొనుగోలుకు డబ్బుల కోసం దొంగతనాలు, దాడులు వంటి నేరాలకు పాల్పడే అవకాశాలు కూడా పెరిగాయి. డ్రగ్ ఆధారిత నేరాల శాతం గత ఐదేళ్లలో 32 శాతం మేర పెరిగిందన్నది ప్రభుత్వ గణాంకాలే చెబుతున్న నిజం. ఇటు తెలంగాణలో 2023లో మాత్రమే గంజాయి అక్రమ రవాణా కేసులు 850కి పైగా నమోదయ్యాయి. హైదరాబాదు, రంగారెడ్డి ప్రాంతాల్లోనే దాదాపు 220 కేసులు చోటుచేసుకున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖ, అల్లూరి సీతారామరాజు, పాడేరు, ముంపు ప్రాంతాల్లో గంజాయి సాగు కొనసాగుతూనే ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు 1,500 ఎకరాల గంజాయి సాగు గుర్తించబడి నాశనం చేయబడినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొనటానికి కేంద్ర ప్రభుత్వం 1985లో మాదక ద్రవ్యాలు మరియు మానసిక ప్రభావ పదార్థాల చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం గంజాయి సాగు, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగం నేరంగా పరిగణించ బడుతుంది. కేంద్ర స్థాయిలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల్లో పోలీసు శాఖలు, ఎక్సైజ్ శాఖలు గంజాయి వ్యాపారాన్ని అరికట్టేందుకు కృషి చేస్తున్నాయి. డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షణ, సరిహద్దుల్లో తనిఖీలు, రహస్య సమాచార మాధ్యమాల ద్వారా గంజాయి వాణిజ్యాన్ని గుర్తించి నిర్వీర్యం చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో అవగాహన సదస్సులు, కళాశాలల వద్ద డ్రగ్ నిరోధ శిబిరాలు నిర్వహించడం మొదలు పెట్టారు. 2025 నాటికి మత్తు పదార్థాల వినియోగాన్ని 50 శాతం తగ్గించాలన్న లక్ష్యంతో కేంద్రం "దేశీయ మత్తు నియంత్రణ చర్యల కార్యాచరణ పథకం"ను చేపట్టింది. ఇందులో అవగాహన కార్యక్రమాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, మానసిక చికిత్సలు, కుటుంబాల సహకారం వంటి అంశాలను మేళవించారు. కొన్ని రాష్ట్రాలు పాఠశాలల పాఠ్యాంశాలలో డ్రగ్స్ హానిపై ప్రత్యేక అధ్యాయాలు ప్రవేశ పెట్టాయి. అయితే ఈ చర్యలు సరిపోవు. సమాజం మొత్తం దీన్ని ఒక జాతీయ సంక్షోభంగా గుర్తించాలి. ప్రతీ పాఠశాల, కళాశాల, కుటుంబంలో ఈ విషయంపై చర్చ, చైతన్యం అవసరం. యువత మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ఉండేందుకు వారికి మానసిక ఆరోగ్య మార్గదర్శకత అవసరం. ఉపాధి అవకాశాలు పెంచాలి. సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా వంటి వేదికల్లో గంజాయి వాడకాన్ని ప్రోత్సహించే దృశ్యాలను నియంత్రించాలి. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఈ పోరాటంలో భాగస్వామ్యం ఉండాలి. గంజాయి మహమ్మారి మన దేశ యువతను బలి తీసుకుంటోంది. అది కేవలం ఒక మత్తు పదార్థం కాదు – అది ఒక భవిష్యత్ హంతక మార్గం. ఈ మత్తు మాయను అంతమొందించాలి. ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మానసిక నిపుణులు, సమాజ సేవా సంస్థలు, యువతీ, యువకులు – అందరూ చేతులు కలిపి పని చేయాలి. అంతే కాదు, మానవతా దృష్టితో ఈ వ్యసనాన్ని ఔషధ చికిత్స, పునరావాసం, బోధన, శిక్షణ, క్రమశిక్షణ అనే అంశాలుగా అర్థం చేసుకుని ముందుకెళ్లాలి. మన దేశం ఆరోగ్యంగా ఉండాలంటే మన యువత ఆరోగ్యంగా ఉండాలి. యువత చేతులు సృష్టి కర్తలుగా ఎదగాలి. మత్తు పదార్థాలకు బానిసలుగా కాక. యువతను గంజాయి సంకెళ్ల నుండి విముక్తి చేయాలంటే – చైతన్యంతో, శక్తితో, స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఒక అడుగు ముందుకు వేయాలి. అప్పుడు గంజాయి రహిత భారతం సాధ్యమే. అప్పుడు మన దేశ భవిష్యత్తు వెలుగులవైపు ప్రయాణిస్తుంది.

## విలక్షణ నటుడు సంజీవ్ కుమార్

ఒక విలక్షణమైన నటుడు. రంగస్థలం అంటే అతనికి ప్రాణం. సినిమాల్లోకి రావాలని ప్రయత్నిస్తున్న సమయంలో రాజశ్రీ సంస్థ స్క్రీన్ టెస్ట్‌లో విఫలమయ్యాడు. అతడే ఆ తర్వాత జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడుగా రెండుసార్లు 'భారత్' అవార్డులను అందుకోవడం విశేషం. ఆయనే సంజీవ్ కుమార్. సంజీవ్ కుమార్ అసలు పేరు హరిహర్ జెఠాలాల్ జరీవాలా (హరిభాయ్ అని కూడా పిలిచేవారు.) ఆయన 1938 జూలై 9న సూరత్, బాంబే ప్రెసిడెన్సీ, బ్రిటిష్ ఇండియాలో ఒక గుజరాతీ పటేల్ కుటుంబంలో జన్మించారు. ఇతని బాల్యం సూరత్‌లో గడచింది. తరువాత ఆయన కుటుంబం ముంబాయికి తరలి వెళ్ళింది. అక్కడ ఒక ఫిలిం స్కూలులో సంజీవ్ కుమార్ శిక్షణ పొందారు. తద్వారా బాలీవుడ్‌లో నటుడిగా స్థిరపడ్డారు. నట జీవితాన్ని నాటక రంగం ద్వారా ప్రారంభించారు. మొదట ఇతడు ముంబాయిలోని "ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్", తర్వాత "ఇండియన్ నేషనల్ థియేటర్" సంస్థల నాటకాలలో వేషాలు వేశారు. రంగస్థల నటుడిగా ఇతడు 22 ఏళ్ల వయసులో ముసలి వేషాలు వేసేవారు. 1952లో శశిధర్ ముఖర్జీ బెంగాలి సినిమా 'బసు పరివార్' చిత్రాన్ని హిందీలో 'హమ్ హిందుస్తానీ' పేరుతో 1960లో పునర్నిర్మించారు. సునీల్ దత్, ఆశాపరేఖ్ జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా సంజీవ్ కుమార్ బాలీవుడ్‌కు పరిచయ మయ్యాడు. ఇతనితోపాటే ప్రేమ్ చోప్డా కూడా వెండితెరకు చేరువయ్యారు. హీరోగా హిందీ సినిమాలో పరిచయం కావడానికి సంజీవ్ కుమార్‌కు ఐదేళ్లు పట్టింది. 1965లో 'నిశాన్' అనే సినిమా ద్వారా కథా నాయకుడి వేషాలు వేయడం మొదలు పెట్టాడు. 1968లో 'సంఘర్ష్' సినిమాలో ప్రముఖ నటుడు దిలీప్ కుమార్‌తో కలిసి నటించారు. తరవాత 'స్మగ్లర్', 'పతి పత్ని', 'హుస్న్ అవుర్ ఇష్?', 'బాదల్' వంటి సినిమాల్లో నటించినా సంజీవ్ కుమార్‌కు పెద్దగా గుర్తింపు రాలేదు. హిందీ సినిమాలలోనే కాక మారాఠీ, తెలుగు, పంజాబీ, సింధీ, తమిళ, గుజరాతీ సినిమాలలో కూడా నటించారు. ఇతడు గుల్జార్, ఎ.కె.హంగల్, హృషీకేశ్ ముఖర్జీ, యశ్ చోప్రా, సుభాష్ ఘాయ్, సత్యజిత్ రే మొదలైన దర్శకులతో పనిచేశారు. అరుణా ఇరానీ, జయ బాధురి, ఎల్.విజయలక్ష్మి, రాఖీ, లీనా చంద్రావర్కర్, సులక్షణా పండిట్, మౌసమీ చటర్జీ, యోగీతా బాలీ, అపర్ణా సేన్, షర్మిలా ఠాగూర్ మొదలైన నటీమణుల సరసన నటించారు. ఇతడు నటించిన షోలే చిత్రంలో ఠాకూర్ పాత్ర ఇతడికి మంచి పేరు తెచ్చి పెట్టింది. 'నయాదిన్ నయీరాత్' సినిమాలో తొమ్మిది పాత్రలను ధరించారు. ఈ పాత్రలను తమిళం (నవరాత్రి)లో శివాజీ గణేశన్, తెలుగు (నవరాత్రి)లో అక్కినేని నాగేశ్వరరావు పోషించారు. బాలీవుడ్‌లో ప్రవేశించిన తొలిరోజుల్లో లఘు బడ్జెట్ సి–గ్రేడ్ చిత్రాల్లో నటించారు. 1965లో 'నిషానా' సినిమాతో హీరో అవతార మెత్తిన సంజీవ్ కుమార్ అచిరకాలం లోనే 'ఖిలోనా' వంటి విభిన్న సినిమాల్లో అద్భుత నటనా వైదుష్యాన్ని చూపి, భవిష్యత్ ప్రస్థానానికి పునాదులు నిర్మించు కున్నారు. రాజిందర్ సింగ్ బేడి నిర్మించిన 'దస్తక్' సినిమా ఉత్తమ కథానాయకునిగా సంజీవ్ కుమార్‌కు జాతీయ పురస్కారాన్ని అందించింది. తరువాత గుల్జార్ దర్శకత్వం వహించిన 'కోషిష్', 'పరిచయ్' సినిమాలు విభిన్న పాత్రలను ప్రసాదించి సంజీవ్ కుమార్‌లోని అసలు సిసలైన నటుణ్ణి వెలికి తీశాయి. గుల్జార్ పర్యవేక్షణలోనే వచ్చిన 'ఆంధీ', 'మౌసమ్' సినిమాలు సంజీవ్ కుమార్ నట ప్రస్థానాన్ని సుస్థిరం చేశాయి. తరువాత గుల్జార్ దర్శకత్వంలో వచ్చిన 'కోషిష్' సినిమా సంజీవ్ కుమార్‌కు ఉత్తమ నటుడిగా జాతీయ బహుమతి తెచ్చి పెట్టింది. ఇక 'షోలే' సినిమాలో ఠాకూర్ బలదేవ్ సింగ్ పాత్రలో ఆయన ఒదిగి పోయారు. ఆయనకు పుట్టుకతోనే గుండెలో లోపం వుండేది. అది జన్యుపరంగా సంక్రమించినదే. 1976లో తొలిసారి గుండెపోటు వచ్చినప్పుడు అమెరికాలో బైపాస్ చికిత్స చేయించు కున్నారు. అయితే 1985 నవంబరు 6న సంజీవ్ కుమార్‌కు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. దాంతో బ్రతికే అవకాశం లేకుండా పోయింది. అయితే ఆరోగ్యాన్ని సరిగ్గా పట్టించుకోక 47 సంవత్సరాలకే బ్రహ్మచారిగా మిగిలి తనువు చాలించారు. గుజరాత్ రాష్ట్రం సూరత్ లో ఒక వీధికి ఇతని స్మృత్యర్థం "సంజీవ్ కుమార్ మార్గ్" అని నామకరణం చేశారు. ఇతనిపేరుతో సూరత్‌లో ఒక పాఠశాల నెలకొల్పారు. 2013, మే 3వ తేదీ భారతప్రభుత్వం ఇతనిపై ఒక తపాలాబిళ్ల విడుదల చేసింది. 14 ఫిబ్రవరి 2014లో ఇతని స్వంత పట్టణం సూరత్‌లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి, ప్రస్తుత భారత ప్రధాని నరేంద్ర మోడీ 108 కోట్ల విలువైన సమావేశ మందిరాన్ని "సంజీవ్ కుమార్ ఆడిటోరియం" పేరుతో ప్రారంభించారు. ఇతని పేరుతో "సంజీవ్ కుమార్ ఫౌండేషన్" ఒక జాతీయ స్థాయి సేవా సంస్థ ఏర్పాటు చేయబడింది. ఈ సంస్థ బాలల విద్య, ఆరోగ్య, సాంస్కృతిక అభ్యున్నతికై పనిచేస్తున్నది.

## పెన్షన్ లైన్ లో దొంగతనం

ఏలూరు పట్టణంలో దొంగలు స్వైర విహారం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెన్షన్ లైన్ లో నివాసం ఉంటున్న మాజీ మంత్రి, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు వ్యక్తిగత సహాయకుడు సమర్పణరావు ఇంటిలో దొంగతనం చెయ్యడానికి ఒక అగంతకుడు విశ్వప్రయత్నం చేశాడు.తెల్లవారు జామున 4:00 గంటలకు గోడ దూకి ఇంట్లోకి దూరి తలుపులు తియ్యడానికి విశ్వప్రయత్నం చేశాడు అనంతరం 2 వ ఫ్లోర్ కు చేరి అక్కడ డోర్ తీయడానికి ప్రయత్నించి విఫలమై అందుబాటులో ఉన్న విలువైన బూట్లు దొంగిలించాడు.ఈ సంఘటనతో కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు.స్థానికంగా యువకులు గంజాయి మత్తులో ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని ఈ పని చేసిందికూడా స్థానికుడే అని పలువురు తెలియజేశారు.

## కార్పొరేట్ రంగానికి కేంద్రం దాసోహం

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, దాని సైద్ధాంతిక భూమిక అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల ప్రకారం కార్పొరేట్ పెట్టుబడిదారీ శక్తుల అనుకూల పరిపాలన సాగిస్తున్నది.2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ అనేక ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేయటమేకాకుండా, దానికనుగుణంగా చట్టాలను రూపొందిస్తూ వస్తున్నది. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల్ని హరించి వస్తువుల, సర్వీసుల పన్ను (జిఎస్‌టి) చట్టాన్ని తీసుకొచ్చారు. జిఎస్‌టి చట్టం మూలమున రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు మున్సిపాలిటీ స్థాయికి దిగజారిపోయాయి. భారత రాజ్యాంగంలో చెప్పిన ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా ఈ చట్టం ఉన్నది. ఆ తరువాత రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్‌ఆర్‌సి) బిల్లును, ఎన్‌పిఆర్ చట్టాలను తీసుకొచ్చింది. అదేవిధంగా భారత రాజ్యాంగంలో కశ్మీర్‌కు ఇచ్చినటువంటి స్వయం ప్రతిపత్తి 370, 35ఎ ఆర్టికల్స్‌ను రద్దు చేసింది. భారతదేశంలో ఇస్లాం ఫోబియాను రెచ్చగొట్టి మైనారిటీ ముస్లింలపై దారుణ మారణకాండ జరపటం దాని ఉద్దేశం. 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన మరుసటి దినం ఆర్‌ఎస్‌ఎస్ అధినేతలు డా. బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, భారత రాజ్యాంగంగా మనస్మృతి ఉండాలని, అదే తమ అభిమతమని వారు ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ ప్రవేశికలో చెప్పినట్లుగా భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, ప్రజాతంత్ర, లౌకిక, గణతంత్ర రాజ్యంగా తాము ఒప్పుకోవటం లేదని వారు అనేక సందర్భాల్లో ఘంటాపథంగా చెప్పారు. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే చట్టం పేరుతో భారతదేశాన్ని హిందూ దేశంగా లేదా హిందూ రాజ్యంగా ఏర్పడాలని ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశమని వారు పదేపదే చెప్పారు. పూర్వం 'జనసంఘ్' రాజకీయ పార్టీయే నేటి 'భారతీయ జనతా పార్టీ'. భారతీయ జనతా పార్టీ ఏర్పడినప్పుడు గాంధీ సోషలిజం తమ లక్ష్యం అన్నారు. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (1973) కేసులో సుప్రీం కోర్టు ధర్మాసనం భారత పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరణ చేసే అధికారం ఉన్నదనీ, అయితే పార్లమెంటు చేసే చట్టాలు రాజ్యాంగ మౌలిక స్వభావానికి లోబడి ఉండాలని, భిన్నంగా ఉండరాదని తీర్పు చెప్పింది.

ఇటీవల ఆ పార్టీ నాయకులు అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ప్రవేశికలో 'సోషలిస్టు, సెక్యులర్' అనేటువంటి పదాలు లేవని పదేపదే చెబుతున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలే బహిరంగ ప్రకటన కూడా ఇచ్చారు. సుప్రీం కోర్టును కూడా ప్రభావితం చేసి బాబ్రీ మసీదు కేసులో తీర్పు వచ్చిన తీరును మనం చూసాం. అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజని గోగోయ్‌కి రాజ్యసభ సభ్యత్వం, మరో సుప్రీం కోర్టు న్యాయమూర్తి నజీర్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ పదవి పొందారు. భవిష్యత్తులో భారత రాజ్యాంగం మౌలిక స్వభావాన్ని కూడా పార్లమెంటు మార్చవచ్చు అనే తీర్పు వచ్చినా మనం ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. భారతీయ జనతా పార్టీకి మాతృసంస్థ అయినటువంటి రాష్ట్రీయ స్వయం సేవక సంఘానికి హిందూ రాష్ట్ర ఎజెండా ఉన్నది. భారతీయ జనతా పార్టీ ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ ఎజెండాకు అనుగుణంగా పరిపాలన సాగిస్తూ వస్తున్నది. 1991లో పివి నరసింహారావు నేతృత్వంలో తీసుకొచ్చిన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్ పిజి) నయా ఉదారవాద విధానాలు బిజెపి ప్రభుత్వం మరింతగా అమలు చేస్తున్నది. అంబానీ, అదానీ లాంటి ఆశ్రితపక్షపాతులకు, కార్పొరేట్ దిగ్గజాలకు దేశసంపదను అప్పజెప్పటానికి మొత్తం ప్రభుత్వరంగ పరిశ్రమలన్నిటినీ ప్రైవేటీకరణకు పూనుకున్నది. అందుకనుగుణంగా అనేక చట్టాలను మారుస్తూ వస్తున్నది. అందులో భాగంగానే మూడు వ్యవసాయ నల్లచట్టాలను తీసుకొచ్చి మొత్తం వ్యవసాయ ఉత్పత్తులన్నిటిని అంబానీ, అదానీలకు వ్యాపార సరుకుగా చేయటానికి పూనుకున్నది. ప్రధాన నరేంద్ర మోడీ అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా ఉంటూ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా భారతదేశ చట్టాలను మారుస్తున్నారు అనే విషయాన్ని మనం ఇక్కడ దృష్టిలో పెట్టుకోవాలి. దీనిని భారతదేశ రైతాంగం, ప్రధానంగా ఉత్తర భారత రైతాంగం ముందు భాగాన నిలబడి దేశ రాజధాని ఢిల్లీ నగరంలో తిష్ట వేసుకుని ఆ చట్టాలను వెనక్కి తీసుకునేంతవరకు సంవత్సర కాలంపైగా దీర్ఘకాలం పోరాటం చేశారు.ఈ సందర్భంలో రైతు సంఘాలతో చేసుకున్న ఒడంబడికను నేటి వరకు అమలు చేయలేదు. అదే సమయంలో 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను 2020 సంవత్సరంలో తీసుకొచ్చారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ నాటినుండి నేటి వరకు కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాన, వామపక్ష పార్టీల నాయకత్వాన సుదీర్ఘమైన పోరాటంచేస్తూ ఉన్నారు. ఆశ్రితపక్షపాత పెట్టుబడిదారులకు ప్రభుత్వరంగ పరిశ్రమలను, జాతి సంపదను అప్పజెప్పటమే కాకుండా దానికనుగుణంగా గత 100 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయాలనే దుష్టతలంపుతో 29 చట్టాలను రద్దు పరిచి నాలుగు లేబర్ కోడ్‌లను తయారు చేసింది.

మొదటిది, 2019 వేతనాల కోడ్ అమలులోకి వస్తే జాతీయ కనీస వేతనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు (పేమెంట్ ఆఫ్ వేజెస్)వేతనాలు నిర్ణయించే అధికారాన్ని కోల్పోతాయి. కనీస వేతనాలు (మినిమం వేజెస్) రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అమలయ్యే అవకాశం ఉండదు. ఓవర్ టైం చేసినందుకు కానీ, సమాన పనికి సమాన వేతనం గాని కోరే హక్కును కార్మిక వర్గం కోల్పోతుంది. రెండవది, 2020 పారిశ్రామిక సంబంధాల కోడ్ అమలులోకి వస్తే సమ్మె హక్కు కోసం కార్మిక వర్గం చాలా కష్టాలు ఎదుర్కోవాలి వస్తుంది. ఈ కోడ్‌లో కార్మికులు సమ్మె చేయటానికి అనేక ఆటంకాలు కల్పించారు. 100 మంది కన్నా తక్కువ మంది కార్మిక సంస్థల్లో పని చేస్తుంటే వారిని పైనుండి తొలగించటం సులభతరం అవుతుంది. పరిశ్రమల్లో కార్మిక సంఘాల ఏర్పాటు కష్టభూయిష్టమవుతుంది. మూడవది, 2020 వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ వల్ల పది మంది కంటే తక్కువ కార్మికులు పనిచేసే కంపెనీలలో కార్మికుల ప్రాణాలకు భద్రత ఉండదు. కాంట్రాక్ట్ కార్మికులు రక్షణ కోల్పోతారు. గిగ్, ఫ్లాట్, ఫారం, కార్మికుల రక్షణపై సరైన నిబంధనలు రూపొందించలేనందున వారికి రక్షణ కరువవుతుంది. నాల్గవది, 2020 సామాజిక భద్రత కోడ్ అమలులోకి వస్తే ఎవరికైనా ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చే అవకాశం వస్తుంది. అందువల్ల యాజమాన్యం ఇఎస్ఐ, పిఎఫ్‌లు, గ్రాడ్యుటి కవరేజ్ లేకుండా ఉంటుంది. కార్మికులకు ఏ అవకాశం ఉండదు. కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే కోటి మంది పైబడిన స్కీం వర్కర్లకి ఈ కోడ్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది.

# శ్రావణ మాసంలో 3 లక్షల ఇళ్ల గృహప్రవేశం

విజయవాడ, జూలై ,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదలకు గుడ్ న్యూస్ చెప్పింది. శ్రావణ మాసంలో పేదలకు ఇళ్లు కేటాయించాలని నిర్ణయించింది. ఈ నెలాఖరు నుంచి వచ్చే నెల మొదటి వారం వరకూ దాదాపు మూడు లక్షల ఇళ్లను లబ్దిదారులకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. శ్రావణమాసంలో పేదల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని సిద్ధమయింది. ఇప్పటికే పనులు పూర్తి చేయడం కోసం లబ్దిదారులకు మూడు వందల కోట్ల రూపాయలను విడుదల చేసి ప్రభుత్వం అధికారులను కూడా ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ మూడు లక్షల ఇళ్లను... కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావస్తుండటంతో పేదలకు మూడు లక్షల ఇళ్లను అప్పగించి వారిని ఇంటి యజమానులుగా చేయాలన్న లక్ష్యంతో ఈ మెగా ఈవెంట్ కు శ్రీకారం చుట్టింది. ఈ సామూహిక పేదల ఇళ్ల గృహప్రవేశాలను శ్రావణమాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తిచేస్తున్నారు. మిగిలిపోయిన పనులను వీలయినంత త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అధికారులకు అందాయి.. గత ఏడాది కాలంలో దాదాపు 2.30 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇక రూఫ్ స్థాయిలో దాదాపు ఎనభై ఏడు వేల ఇళ్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. లింటెట్ స్థాయిలో 1.2 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉండగా, పునాది వేసిన ఇళ్లు యాభై వేల వరకూఉన్నాయి. దీంతో వీటిని పూర్తి చేయడానికి అధికారుల సిద్ధమయ్యారు. ఇసుక కూడా సిద్ధంగా ఉంచడంతో వేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు నిర్విరామంగా పనిచేస్తున్నారు.లబ్దిదారులకు సాయం... మంజూరయిన ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయలు చెల్లిస్తుంది. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద మరో ముప్ఫయి వేలు అదనంగా ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం దీనికి అదనంగా వెయ్యి రూపాయలుచెల్లిస్తుంది. రూరల్, అర్బన్ ఏరియాల్లోని ఎస్సీ లబ్దిదారులకు , బీసీలకు యాభై వేల రూపాయలు చొప్పున, ఎస్టీలకు 75 వేల రూపాయలు, ఆదివాసీ గిరజనులకు లక్ష రూపాయలు అదనంగా సాయం అందిస్తుంది. వేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి శ్రావణమాసంలో మూడు లక్షల ఇళ్లను ఒకేసారి ప్రారంభించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు.

# ఆనం వర్సెస్ నారాయణ

నెల్లూరు, జూలై 8, నెల్లూరులో ఇద్దరు మంత్రుల మధ్య పొసగడం లేదని తాజాగా బయటపడింది. నెల్లూరులో వీఆర్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యా మంత్రి లోకేష్ పాల్గొన్నారు. మంత్రులు నారాయణతో పాటు ఆనం రామనారాయణరెడ్డి కూడా పాల్గొన్నారు. అందరూ స్కూల్ ఓపెనింగ్ గురించి మాట్లాడారు. అయితే మంత్రి ఆనం మాత్రం అనూహ్యంగా స్కూల్ కు మున్సిపల్ కార్పొరేషన్ పేరు పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆనం రామనారాయణ రెడ్డి వీఆర్ హైస్కూల్‌ను మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌గా మార్చడంపై వేదికపై అభ్యంతరం వ్యక్తం చేశారని, స్కూల్ అభివృద్ధికి మున్సిపల్ మంత్రి సహకరిస్తే అది మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ ఎలా అవుతుందని ప్రశ్నించారని తెలుస్తోంది. చాలా మంది కాంట్రాక్టర్లు తమ సీఎస్ఆర్ ఫండ్స్ ఇస్తే స్కూల్ రీఓపెన్ అయిందన్నారు. మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి , పొంగూరు నారాయణ మధ్య స్కూల్ విషయంలో వివాదాలు ఉన్నట్లుగా ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ పేరు వివాదంపై మంత్రి నారాయణ ఎలాంటి కామెంట్లు చేయలేదు. నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ అసలు పేరు వెంకటగిరి రాజా హైస్కూల్. 2021లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూతపడింది. గత ప్రభుత్వ హయాంలో స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది, దీని వల్ల నిర్వహణ కష్టమైంది. స్కూల్ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, తగిన నిర్వహణ మరియు ఆధునీకరణ లేకపోవడం కూడా మూతకు కారణమైంది. ఎయిడెడ్ సంస్థల ఆస్తులపై దృష్టి పెట్టి స్కూల్‌ను మూసివేసేలా చేసిందని విమర్శలు ఉన్నాయి. 2025లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రి పొంగూరు నారాయణ , నారా లోకేష్ ఆధ్వర్యంలో, రూ. 15 కోట్ల నిధులతో స్కూల్‌ను ఆధునీకరించి, అంతర్జాతీయ ప్రమాణాలతో జూలై 7, 2025న తిరిగి ప్రారంభించారు. ఎన్‌సీసీ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ఇచ్చింది. మంత్రివర్గంలో నెల్లూరు జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉన్నారు. ఒకరు పొంగూరు నారాయణ కాగా..మరొకరు సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి. ఆనం దేవాదాయశాఖను చూస్తున్నారు. పొంగూరు నారాయణ మున్సిపల్ మంత్రిగా ఉన్నారు. ఆయనే మున్సిపల్ కార్పొరేషన్ పేరును పెట్టించారని ఆనం భావిస్తున్నారు. గతంలో వీఆర్ స్కూల్ తమ నిర్వహణలో ఉండేదని.. తమపై కోపం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా నిర్వీర్యం చేసి మూసేయించారని అన్నారు. అయితే మున్సిప్ల పేరు పెట్టకుండా.. ఎవరు పేరు పెట్టాలి.. ఆనం కుటుంబీకుల పేరు పెట్టాలా లేకపోతే.. సీఎస్ఆర్ ఫండ్స్ ఇచ్చిన కంపెనీ పేరు పెట్టాలా అన్నదాన్ని మాత్రం.. ఆనం చెప్పలేదు. ఈ వ్యవహారంతో నెల్లూరు జిల్లాలోని మంత్రుల మధ్య పొసగడం లేదని అర్థం అవుతుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి

# ఏఐతో దోమలకు చెక్...

ఒంగోలు, జూలై , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దోమల బెడదను నివారించడానికి సరికొత్త ప్రణాళికను సిద్ధం చేసింది.

కృత్రిమ మేధస్సు ఆధారిత స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌ను విజయవాడ, విశాఖ, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి నగరాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ వ్యవస్థ ద్వారా దోమల ఉత్పత్తి ప్రాంతాలను గుర్తించి డ్రోన్ల ద్వారా రసాయనాలు పిచికారీ చేసి దోమలను నియంత్రిస్తారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాలనలో సాంకేతికతకు పెద్ద పీట వేస్తున్న సంగతి తెలిసిందే. పాలనలో సాంకేతికత వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలు తీసుకువచ్చింది. అలాగే పురపాలికల్లో సమస్యలను ప్రజలు నేరుగా ప్రభుత్వానికి తెలియజేసేలా పురమిత్ర పేరుతో యాప్ కూడా తీసుకువచ్చారు. ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు ఏఐ సాయంతో దోమలకు చెక్ పట్టాలని ప్లాన్ చేస్తోంది. మోడ్రన్ టెక్నాలజీ వాడి దోమలను నియంత్రించాలనేది ఏపీ ప్రభుత్వం ఆలోచన. ఈ క్రమంలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిచేసే స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాలలో అమలు చేయానున్నారు.

విజయవాడ, విశాఖ, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి వంటి ప్రాంతాల్లో ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ అమలు చేస్తారు. ఇక్కడ వచ్చే ఫలితాలను అనుసరించి.. తర్వాత దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ఓ ప్రైవేట్ సంస్థ రూపొందించింది. ఈ విధానంలో భాగంగా.. దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉండే 66 ప్రాంతాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిచేసే సెన్సార్లు ఏర్పాటు చేస్తారు. ఈ సెన్సార్లు.. ఆ ప్రాంతంలో దోమల సాంద్రత, అలాగే ఉష్ణోగ్రత వంటి వివరాలను సేకరించి.. సెంట్రల్ సర్వర్‌కు సమాచారం పంపుతుంది.ఈ సమాచారం ఆధారంగా ఆయా ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమల నియంత్రణ కోసం రసాయనాలు పిచికారీ చేస్తారు. స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ద్వారా సమయం ఆదా కావటంతో పాటుగా ఖర్చు కూడా కలిసి వస్తుందని.. అధికారులు చెప్తున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న ప్రాంతాల్లో స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ మంచి ఫలితాలను ఇస్తే.. రాష్ట్రంలోని మిగతా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో దీనిని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దోమల నియంత్రణ ద్వారా వ్యాధులను అరికట్టాలని.. ప్రజారోగ్యం కాపాడాలనేది ప్రభుత్వం ఆలోచన. ఆ రకంగా టెక్నాలజీ సాయంతో దోమలను నియంత్రించాలని ఏపీ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

# మూలపేట నుంచి మరో జాతీయ రహదారి

విశాఖపట్టణం, జూలై 8,ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మరో తీపికబురు చెప్పింది.. ఉత్తరాంధ్రలో కీలకమైన మరో గ్రీన్ ఫీల్డ్ కోస్టల్ నేషనల్ హైవేకు లైన్ క్లియర్ అయ్యింది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నుంచి భీమిలి వరకు గ్రీన్ ఫీల్డ్ కోస్టల్ హైవే నిర్మాణం కానుంది. ఇటీవల ఈ హైవే గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని రిక్వెస్ట్ చేశారు.. దీంతో ఓకే చెప్పారు. ఈ హైవే మూలపేట పోర్టుకు అనుసంధానంగా ఉంటుందని చెబుతున్నారు. పర్యావరణానికి అనుకూలంగా, వేగంగా వెళ్లేందుకు ఉపయోగంగా ఉంటుందంటున్నారు.విశాఖపట్నం నుంచి భీమిలి వరకు జాతీయ రహదారి ఉంది.. భోగాపురం దగ్గర ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణం జరుగుతోంది.. అటు శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టుకు ఆరు లేన్ల రహదారి అవసరం ఉందన గుర్తించారు. అందుకే భోగాపురం ఎయిర్ పోర్టుకు, మూలపేట పోర్టుకు కనెక్టివిటీని పెంచే పనిలో ఉన్నారు.. విశాఖఫట్నం వరకు లింక్ చేయనున్నారు. అటు పర్యాటకం అభివృద్ధి చెందడంతో పాటుగా ఆక్వా పరిశ్రమలు కూడా వస్తాయని భావిస్తున్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ హైవేకు సంబంధించి ఫోకస్ పెట్టారు. ఆయన కూడా ఈ కోస్టల్ నేషనల్ హైవే ఆవశ్యకతను కేంద్రానికి వివరించారు. అయితే సుమారు 200 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ కోస్టల్ నేషనల్ హైవేకు భూ సేకరణ ఏపీ ప్రభుత్వం చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఈ హైవేకు సంబంధించి ఆదేశాలు ఇంకా రాలేదని.. ఒకవేళ వస్తే కనుక డీపీఆర్ రెడీ చేస్తామంటున్నారు అధికారులు. ఈ ప్రాంతంలో అటవీ, తీరప్రాంత, జిరాయితీ, స్థలాలు ఎంత అవసరమో గుర్తిస్తామన్నారు.మరోవైపు మూలపేట పోర్టు పరిధిలో అమెరికాకు చెందిన ఎగ్జాంబిల్ కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చింది. గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్ పాలీఇథలీన్ పరిశ్రమను 1,250 ఎకరాల్లో రూ.83,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. గతవారం ఆ సంస్థ ప్రతినిధులు అధికారులతో కలిసి ఈ ప్రాంతాన్ని పరిశీలించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆర్డీవో ప్రభుత్వం సంస్థకు కల్పించే సౌకర్యాలను వివరించారు. మూలపేట పోర్టుకు రైలు, రోడ్డు రవాణా సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. పోర్టు ఆవశ్యకతను కూడా వివరించారు.

# అడ్డగోలుగా వయాగ్రా...

కాకినాడ, జూలై 8, గోదావరి జిల్లాల్లో వయాగ్రా, అబార్షన్ టాబ్లెట్ల అడ్డగోలు అమ్మకాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు డ్రగ్ కంట్రోల్ అధికారులు. మెడికల్ షాపుల్లో సోదాలు చేసి పాత రికార్డ్స్ కూడా పరిశీలిస్తున్నారు. తనిఖీల్లో అనేక షాకింగ్ విషయాలు బైటికొస్తున్నాయి.అబార్షన్ ట్యాబ్లెట్స్ అమ్మకాలు పెంచడానికి సేల్స్‌మెన్‌కు టార్గెట్లు పెట్టి మరీ దందాకు పాల్పడుతున్నారు అక్రమార్కులు. ఫార్మా కంపెనీల్లో పనిచేసి మానేసినవాళ్లేమెడికల్ రిప్రజెంటేటివ్స్ ద్వారా వయాగ్రా సేల్స్‌కి తెగిస్తున్నట్టు తేలింది. టార్గెట్ పూర్తి చేయాలన్న ఒత్తిళ్లు భరించలేక బ్లాక్‌లో మందులు అమ్ముతున్నారు. అబార్షన్ కిట్లు, వయగ్రా టాబ్లెట్లు అడిగిందే తడవుగా అమ్మిన దుకాణదారులపై చర్యలు తప్పవంటున్నారు అధికారులు.వయాగ్రా? అది షెడ్యూల్డ్ ఊ కేటగిరీకి చెందిన మెడిసిన్ అనీ, ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మనేకూడదని తెలిసినా.. షాపుల్లో మాత్రం అంతా విచ్చలవిడితనమే. కౌంటర్లో చెయ్యి పెట్టి అడిగితే చాలు.. స్టాకు లేకపోయినా తెప్పించి మరీ ఇస్తారు. వయాగ్రా మందులు ఆఫ్‌లైన్లోనే కాదు ఆన్‌లైన్‌లో కూడా విచ్చలవిడిగా అమ్మకమౌతున్నాయి. అక్కడైతే అధికారుల తనిఖీలుండవు, అమ్మే వాళ్లకు కొనేవారు ఎవరో కూడా తెలీదు .. కొన్నవాళ్ళు వాటిని వాడి ఏమైపోతారన్న కనీస స్పృహ కూడా ఉండదు. కొన్ని ప్రతికూల ఎంజైముల్ని నియంత్రించి, రక్తప్రసరణ పెరగడం కోసమే తయారయ్యే మెడిసిన్ వయాగ్రా. ఒక్కో వయసు వారికి ఒక్కో రీతిలో ఉండే బ్లడ్ ఫ్లోను వయాగ్రాతో సమతుల్యం చెయ్యొచ్చు కానీ.. అవగాహన లేకుండా మోతాదుకు మించి వాడితే.. తాత్కాలిక తృప్తి సంగతి అటుంచితే తలనొప్పి, జీర్ణకోశసమస్యలు, గుండెపోటు లాంటి తీవ్ర సమస్యలు పక్కా.వయాగ్రా.. ఎంత బెటర్‌మెంట్ ఇస్తుందని ఆశపడతారో.. అంతకంటే ఎక్కువ సైడ్ ఎఫెక్ట్స్ బాధపెడతాయ్. హార్ట్ ఎటాక్స్‌కి దారితియ్యొచ్చు? కిడ్నీలపై చెడుప్రభావం చూపనూవచ్చు. దాంతో ప్రమాదం ఉంది కనుకనే అమ్మకాలపై నియంత్రణ పెట్టారు. దాన్ని మీరి.. విచ్చలవిడిగా విక్రయించడం మొదలైతే?దాన్ని వాడేవాళ్ల మెంటల్ స్టేటస్‌ను ఎవరూ కంట్రోల్ చెయ్యలేరు. ఇదే ముఠా ఇంకాస్త విజృంభించి సిటీల్లోకి పాకితే పరిస్థితి మరీ దారుణంగా మారుతుంది కనుక.. ఉక్కుపాదం మోపుతోంది డ్రగ్ కంట్రోల్ విభాగం.

# స్టేట్ ఫైట్ కు సిద్ధమవుతున్నారా?

విజయవాడ, జూలై 8, ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ నాయకులకు భయం పోయినట్లుంది. ఇన్నాళ్లు రెడ్ బుక్ అని భయపడి కొంత వెనక్కు తగ్గిన వారు ఇప్పుడు తలెత్తి మరీ తొడకొడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఇద్దరు ముగ్గురు వైసీపీ నేతలు మాత్రమే బయటకు వచ్చి అధికార పార్టీపై విమర్శలు చేసేవారు. వరస కేసులు నమోదవుతుండటంతో పాటు అక్రమ కేసులు బనాయిస్తుండటంతో కొంతకాలం మౌనం పాటించడమే మంచిదని భావించి తమ నియోజకవర్గానికే కొందరు వైసీపీ నేతలు పరిమితం కాగా, మరికొందరు మాత్రం వ్యాపారాలు చూసుకుంటూ రాజకీయాలకు దూరంగా కాలం వెళ్లబుస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏడాది అయిన తర్వాత మాత్రం నేతలందరూ ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడటంతో పాటు ప్రధానంగా తమకు కూటమి వల్ల ఇబ్బందులుగా ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనూ కొంత అనుకూలత కనిపిస్తుండటంతో ఇప్పుడిప్పుడే మీడియా ముందుకు వచ్చి అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నారు. వల్లభనేనివంశీ, పోసాని కృష్ణమురళి, నందిగం సురేష్, కాకాణి గోవర్ధన్ రెడ్డి లాంటి వారు జైలుకెళ్లి బయటకు వచ్చారు. కేసులు పెట్టినా మహా అయితే రెండు నుంచి మూడు నెలలు జైల్లో ఉంటామని, ఆ తర్వాత నియోజకవర్గంలో సానుభూతి పెరగడంతో పాటు తమకు వచ్చే ఎన్నికల్లో అడ్వాంటేజీగా మారుతుందని లెక్కలు వేసుకుంటున్నారు. అందుకే దమ్ముంటే కేసులు పెట్టుకోవాలంటూ సవాల్ విసురుతున్నారు.వైఎస్ జగన్ పదే పదే వచ్చే ఎన్నికల్లోనూ గెలుపు తథ్యమని చెబుతుండటంతో పాటు అవసరమైతే కొత్త తరం నేతలను ఎంపిక చేస్తామని చెబుతుండటంతో ఇక బయటకు రాక తప్పడం లేదు. ప్రధానంగా జగన్ కూడా ఎవరు ఈ ఏడాది నుంచి యాక్టివ్ గా ఉన్నారు? ఎవరు ప్రజలకు, కార్యకర్తలకు దూరంగా ఉన్నారన్న లెక్కలు తీస్తున్నారట. వారు ఇన్నాళ్లు బయటకు రాకపోవడానికి గల కారణాలపై కూడా నివేదికలు తెప్పించుకున్నారని తెలిసిన నేతలు ఇక అసలుకే ఎసరు వస్తుందని భావించి ఇప్పుడు స్ట్రీట్ ఫైట్ కు సిద్ధమయ్యారు. జగన్ కూడా వరసగా కార్యక్రమాలను ఇస్తుండటం, ఏ నియోజకవర్గాల్లో ఎవరు పాల్గొన్నారన్నది రిపోర్టులు తెప్పించుకోవడంతో కొంత నేతల్లోనూ అలజడి స్టార్టయిందంటున్నారు.మొన్నటి వరకూ ఉత్తరాంధ్ర నేతలు పెద్దగా యాక్టివ్ గా లేరు. అలాగే తూర్పు గోదావరిజిల్లా నేతలు కూడా తమకు రాజకీయ భవిష్యత్ ఉంటుందా? లేదా? అన్నసందేహంలో ఉన్నారు. అయితే కాపు సామాజికవర్గంలోనూ కొంత సానుకూలత ఏర్పడటంతో పాటు జగన్ వైపు కొన్ని వర్గాలు మొగ్గ చూపుతున్నాయని తెలుసుకున్న నేతలు ఇక దూకుడుగా వెళ్లాలని నిర్ణయించుకున్నట్లే కనపడుతుంది. మరొక వైపు ఏదో ఒక సమస్యపై జగన్ జిల్లాల పర్యటనలకు వస్తుండటంతో కూడా తమ ప్రాంతానికి వచ్చినప్పుడు జగన్ కు తప్పుడు సమాచారం ఎవరైనా ఇస్తారేమోనని చెప్పి కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారట. పార్టీ కార్యాలయంతో పాటు నియోజకవర్గంలోనే ఉంటూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని చెబుతున్నారు. మొత్తం మీద ఏడాదిలోనే ఫ్యాన్ పార్టీలో ఎంత మార్పు అని సొంత పార్టీ నేతలే ముక్కున వేలేసుకుంటున్నారు.

# జనవరి నుంచి మరో 62 అన్న క్యాంటిన్లు

కాకినాడ, జూలై 8, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లపై ప్రజల్లో పాజిటివ్ రెస్పాన్స్ ఉంది. అందుకే దీన్ని ప్రతి అసెంబ్లీ నియోజవర్గంలో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇప్పటికే దాదాపు 113 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్లు ఉన్నాయి. ఇప్పుడు మిగతా 62 నియోజకవర్గాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే జనవరి నాటికి ప్రతి నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం బిల్డింగ్‌లు నిర్మిస్తుంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ప్రక్రియ కూడా ప్రారంభించేశారు. ఈ భవనాలను డిసెంబర్‌కు పూర్తి చేసి జనవరిలో అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని చూస్తున్నారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రూ.61 లక్షలతో ఒక్కో భవనం నిర్మిస్తున్నారు. అంటే ఇప్పుడు కొత్తగా నిర్మించే భవనాలకు ప్రభుత్వం రూ.41.70 కోట్లు ఖర్చు చేస్తుంది. పేదలి ఆకలి తీర్చేందుకు ఈ అన్న క్యాంటీన్ కాన్సెప్ట్ తీసుకొచ్చారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 205 అన్న క్యాంటీన్‌లు ఉన్నాయి. వాటిలో 1,84,500 మంది ఫుడ్ తీంటున్నారు. దీనిపై ప్రభుత్వం నెలకు రూ.11 కోట్లు ఖర్చు చేస్తోంది. అంటే ఏడాదికి రూ.132 కోట్లు వెచ్చిస్తోంది. అన్న క్యాంటీన్‌లలో ఐదు రూపాయలకే అన్నం పెట్టడంతో ఈ క్యాంటీన్లు ప్రజాదరణ పొందాయి. ఉదయం టిఫిన్ మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కూడా పెడుతున్నారు. ఇలా ఫుడ్ పెట్టేందుకు టిఫిన్‌పై 17 రూపాయలు, మధ్యాహ్నం, రాత్రి భోజనంపై చెరో 29 రూపాయలు ఖర్చు చేస్తోంది.

మొత్తంగా ఒక వ్యక్తి అన్న క్యాంటీన్‌లో మూడు పూటల భోజనం చేస్తే ఆ వ్యక్తిపై 75రూపాయలు ఖర్చు పెడుతున్నందన్నమాట. క్వాలిటీ ఫుడ్ ఐదు రూపాయలకే పెడుతుండటంతో నియోజక వర్గస్థాయిలో పెడితే మంచిందనే ఆలోచన ప్రజల్లో వచ్చింది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చంద్రబాబు 70 అన్న క్యాంటీన్‌లు ఏర్పాటుకు ఓకే చెప్పారు. ఇప్పుడు ఉన్నవి ఎక్కువ పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం అయ్యాయి. అందుకే ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో క్యాంటీన్ ఉండేలా సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా మరో 62 నిర్మిస్తున్నారు. వాటిని జనవరిలో ప్రారంభించేలా ప్లాన్ చేస్తున్నారు.

# వన్ టైమ్ ఎమ్మెల్యేపై జరాభద్రం

విజయవాడ, జూలై 8, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఎవరినీ స్పేర్ చేసే పరిస్థితుల్లో లేరు. గత ఎన్నికల్లోనే సీనియర్ నేతలను పక్కన పెట్టారు. అలాంటిది ఏమాత్రం అలక్ష్యం ప్రదర్శించినా, పనితీరులో వెనకబడినా ఏ మాత్రం ఉపేక్షించరు. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలు అర్థమయింది. ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యేల్లో దాదాపు 90 శాతం మంది సొంత బలంతో గెలిచిన వారు కాదు. కేవలం టీడీపీ గుర్తు, కూటమి పార్టీల కలయిక వల్లనే ఒక్కసారిగా హైప్ క్రియేట్ అయి గత ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా స్ట్రయిక్ రేటు వచ్చింది. చంద్రబాబు నాయుడులో కూడా ఆత్మవిశ్వాసం పెరిగింది. మరోసారి జగన్ ను రానిచ్చేది లేదని చంద్రబాబు పదే పదే చెబుతుండటానికి కారణం కూడా అదే.2029 ఎన్నికల నాటికి ఇక నియోజకవర్గంలో వెనకబడిన ఎమ్మెల్యేలకు టిక్కెట్ ఉండదు. ఆయనకు కార్యకర్తలు ముఖ్యమని పదే పదే చెబుతున్నారు. ఎమ్మెల్యేల పనితీరును నెలవారీ సమీక్షలు చేస్తానని, అనుకున్న లక్ష్యాలను నెరవేరిస్తేనే తిరిగి టిక్కెట్ అని, లేకుంటే వన్ టైమ్ ఎమ్మెల్యేలుగానే మిగిలిపోతారని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. తనకు పార్టీ ముఖ్యం. తిరిగి గెలవడమ లక్ష్యం. అంతే కాని కొత్త ముఖాలు అస్సలు ప్రధానం కాదు. ఈ విషయం ఎమ్మెల్యేలకు కూడా తెలియంది కాదు. వార్నింగ్ లు ప్రస్తుతం సుతిమెత్తంగానే హెచ్చరిస్తున్నా అవి రేపు టిక్కెట్ల కేటాయింపు సమయంలో కౌంట్ అవుతాయన్నది అందరూ అంగీకరిస్తున్న మాట.2024 ఎన్నికల్లో సీనియర్ నేతలను చంద్రబాబు నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారు. దేవినేని ఉమ వంటి వారికి కూడా టిక్కెట్ లేదు. పొత్తులో భాగంగా అనేక మంది నేతలు టిక్కెట్లు కోల్పోయారు. ఇక ఒక కుటుంబానికి ఒక టిక్కెట్ అన్నది ఖచ్చితంగా అమలు చేశారు. జేసీ, కోట్ల వంటి కుటుంబాలను కూడా కేర్ చేయలేదు. కేవలం ఒక టిక్కెట్ ను మాత్రమే ఇచ్చి దానితో సంతృప్తి పడమన్నారు. అంటే మొన్నటి ఎన్నికల్లోనే చంద్రబాబు ఎఫెన్స్ లో వెళ్లినప్పుడు ఇక వచ్చే ఎన్నికల్లో ఇంకెంత స్పీడ్ గా ఉంటారో వేరే చెప్పాల్సిన పనిలేదు. గెలుపు గుర్రాలకే టిక్కెట్లు కేటాయిస్తారన్నది వాస్తవం. అది కూడా అన్నీ లెక్కలు వేసుకుని మరీ బరిలోకిదింపుతారు. అందులో ఏమాత్రం సందేహం లేదు.ఇది వరకటి టీడీపీ కాదు. ఇప్పుడు చంద్రబాబుకు తోడుగా లోకేశ్ ఉన్నారు. ఇద్దరూ వేగంగా నిర్ణయాలు తీసుకునే నేతలే.పార్టీని గతంలో వీడి వెళ్లిన వారిని కూడా పెద్దగా పార్టీలోకి తీసుకోవడం లేదు. అదే సమయంలో పార్టీ లైన్ ను దాటి వ్యవహరించిన వారిని కూడా ప్రస్తుతం ఏమీ అనకపోయినా నాలుగేళ్ల తర్వాత మాత్రం అది కౌంట్ అవుతుంది. అందుకే ఎమ్మెల్యేలు గతంలో మాదిరిగా చంద్రబాబు మెతక వైఖరితో ఉంటారనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఆయన పూర్తిగా మారిపోయారు. అదీ ఆయన గత ఏడాది నుంచి నడుస్తున్న తీరును చూస్తుంటే అర్థమవుతుంది. ఈసారి అనేక మంది కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికయిన వారు, సీనియర్ నేతలకు కూడా భంగపాటు తప్పేట్లు లేదు.

# సింహాచలంలో మంత్రి అనిత ప్రత్యేక పూజలు

విశాఖపట్నం సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారిని హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో హోం మంత్రికి ఘన స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేసారు. మంత్రి అనితకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసారు. గిరిప్రదక్షిణ నేపథ్యంలో మంత్రి ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేసారు.

మంత్రి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పటిష్ట ఏర్పాట్లు చేశాం. టోల్ ఫ్రీ నెంబర్లు అందుబాటులోకి తీసుకువచ్చాం. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు.

# ఇండోసోల్ ప్రాజెక్టు.. అప్పుడు అలా... ఇప్పుడు ఇలా

నెల్లూరు, జూలై 8, వేలాది మంది రైతులు.. గొంతెత్తి అరుస్తున్నారు.. రోడ్డెక్కి నినదిస్తున్నారు? దీనంగా మొరపెట్టుకుంటున్నారు.. అయినా ఏలిన వారు స్పందించడం లేదు. దక్షిణ కోస్తా ప్రాంతంలో ఇండోసోల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఓ సోలార్ కంపెనీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం ఇది. తమ పొలాలు పోతున్నాయని.. రైతులు రగిలిపోతుంటే.. ప్రభుత్వం సైలెంట్.. ప్రభుత్వాధినే?తా సైలంట్.. అధికార పార్టీ సెలంట్.. మిత్రపక్షాలు సెలంట్.. ప్రతిపక్షాలూ.. సైలంట్.. టోటల్‌గా ఓ నిశ్శబ్దమే రాజ్యమేలుతోంది..నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోని కరేడు గ్రామపంచాయతీ పరిధిలోని ఓ 15 గ్రామాల పరిధిలో షుమారు 4500 ఎకరాల్లో భూసేకరణకు జూన్ 22న నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ భూమి సేకరణ ఎందుకంటే..ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఆ సంస్థ ఈ ప్రాంతంలో సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారు చేస్తుంది. ఇది దేశంలోనే అతిపెద్ద, ఇంటిగ్రేటెడ్ సోలార్ ప్యానల్స్ తయారీ ప్లాంట్ అని చెబుతున్నారు. 8,000 ఎకరాల్లో 5ఉచి చొప్పున మొత్తం రెండు దశల్లో 10ఉచి సామర్థ్యంతో దీనిని నిర్మించనున్నారు. పరిశ్రమలో సోలార్ సెల్స్, వాఫర్స్, పాలిసిలికాన్, గ్లాస్ ప్యానెల్స్ తయారీతో పాటు అనుబంధ పరిశ్రమలు, టౌన్‌షిప్, ఇతర మౌలిక వసతులు కూడా ఉంటాయి. మొత్తం రూ. 25,000 కోట్ల పెట్టుబడితో 23,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించే అవకాశం ఉందని కంపెనీ చెబుతోంది.అంతపెద్ద పెట్టుబడితో.. ఇంత పెద్ద పరిశ్రమ వస్తుంటే సంతోషించాలి కానీ... మరి వివాదం ఎందుకు..?ఎందుకంటే. పచ్చని పొలాలతో.. పకృతి రమణీయంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పరిశ్రమ కోసం ఎంపికచేయడమే సమస్య..! ఇక్కడ ఉన్న భూమిని తీసుకుని పరిశ్రమకు ఇవ్వడానికి రైతులు ఒప్పుకోవడం లేదు. తమ భూమిని ఇవ్వం అని తెగేసి చెబుతున్నారు. ఎక్కడ పరిశ్రమ ఏర్పాటు అయినా రైతుల నుంచి అభ్యంతరాలు తప్పవు. కాకపోతే.. పంటలు సరిగ్గా పండని బంజరు ప్రాంతాలు, నీటి సౌకర్యం తక్కువ ఉన్న పొలాలను.. వీటికోసం ఎంపిక చేస్తారు. వ్యవసాయం కంటే.. అక్కడ ఉపాధి అవసరం ఎక్కువ ఉన్న భూములు తీసుకుంటారు. కానీ ఇలాంటి సారవంతమైన భూములను తీసుకుంటామనడంతో గొడవ మొదలైంది. రైతులు తమ జీవనాధారం కోల్పోతామని, ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. జూన్ 29 న వీళ్లు జాతీయ రహదారిని దిగ్బంధించారు. గ్రామసభల్లో తమ భూములు ఇవ్వమని చెప్పేశారు.మరి ఇంత జరుగుతుంటే.. సంబంధిత మంత్రి? గొట్టిపాటి రవికుమార్ మాట్లాడలేదు. ? ఒకప్పుడు ఈ ప్రాంతం ప్రకాశం జిల్లాలోనే ఉండేది ఆయన ఆ జిల్లా మంత్రి కూడా..! డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడటం లేదు. చిన్న విషయానికి కూడా స్పందించే సీఎం చంద్రబాబు నోరెత్తడం లేదు.. ఆ పార్టీ నేతలు అధికారికంగా స్పందించడం లేదు. ఆ పార్టీ భవిష్యత్ అని చెప్పే నారా లోకేష్ నో రెస్పాన్స్? అన్యాయం జరిగితే నినదిస్తా అని చెప్పే కూటమి మిత్రుడు పవన్ కల్యాణ్ పత్తాలేరు.. బీజేపీ నోరెత్తడం లేదు. ఇలా మొత్తం సర్కారు వారి సైలెన్స్ లా పరిస్థితి ఉంది.ఈ విషయంలో ప్రభుత్వం కు మేలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని అందరూ అనుకునేలా వాళ్ల వ్యవహారశైలి ఉంది. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకోవడానికి ప్రధాన కారణం.. ఈ ప్రాజెక్టును అధికారంలోకి రాకముందు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎలక్షన్‌కు ముందు ఆ పార్టీకి వాయిస్ గా ఉన్న లోకేష్ తన పాదయాత్రలో ఇండోసోల్‌ను కంపెనీ అన్నారు. మరి అప్పటి ఫేక్ కంపెనీ రెండేళ్లలో కంపెనీ అయిపోయిందా అని జనం ప్రశ్నిస్తున్నారు. ఒకసారి లోకేష్ అప్పుడు ఏం చెప్పారో చూడండి..కనీసం లక్ష రూపాయల కేపిటల్ లేనటువంటి.. కంపెనీ 72వేల కోట్ల పెట్టుబడులు పెడుతుందా అన్నది ఆయన ప్రశ్న. మరి ఈ రెండేళ్లలో పెట్టుబడులు ఎక్కడ నుంచి తెచ్చింది ఇండో సోల్ సంస్థ షిరిడిసాయి ఎలక్ట్రికల్స్ కు చెందిన సబ్సిడరీ కంపెనీ.. ఈ సంస్థకు కిందటి జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం ఆయాచిత లబ్ది చేకూర్చిందని తెలుగుదేశం పదే పదే ఆరోపించింది. ట్రాన్స్ ఫార్మర్లలో దోపిడీ చేసిందన్నారు. స్మార్ట్ మీటర్లతో దోచుకున్నారు అని చెప్పారు. అసలు ఆ కంపెనీలో జగన్ బినామీ అని కూడా చెప్పారు. మరి అలాంటి కంపెనీపై అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది.. ఎందుకు విచారణ జరిపించడం లేదు. అది చేయకపోగా.. ఇలా భూములను ఎందుకు కట్టబెడుతున్నారు..పరిశ్రమలు రావడం అవసరమే కానీ.. నిజంగా దానికి అంత భూమి ఎందుకు.. కిందటి ప్రభుత్వం 5వేలు ఎకరాలు ప్రతిపాదిస్తే ఇప్పుడు 8వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారు...?అంత పెట్టుబడిని ఎక్కడ నుంచి తీసుకొస్తుంది.. వీటికి దేనికీ సమాధానాలు లేవుసహజంగా అధికారపక్షం వైపు తప్పు ఉంటే ప్రతిపక్షం రాజకీయ లబ్ది కోసమైనా దానిని టేకప్ చేస్తుంది. కానీ ఇక్కడ కరేడు వాసులది దీనస్థితి.. తెలుగుదేశం ప్రభుత్వం, పార్టీ అధికారికంగా స్పందించకపోయినా.. ఆ పార్టీ లోకల్ నాయకత్వం, సానుభూతి పరులు వాళ్లకి మద్దతు తెలుపుతున్నారు. కానీ దీనిపై స్పందించాల్సిన మాత్రం పూర్తి సైలంట్. కొంతమంది రౌడీషీటర్లను కొడితేనే పనిగట్టుకుని వెళ్లి పరామర్శించి వచ్చిన జగన్ మోహనరెడ్డికి కనీసం దీనిపై స్పందించడం లేదన్నది వాళ్ల ఆవేదన. ఈ ప్రాజెక్టు యాజమాన్యానికి వైసీపీకి సంబంధాలున్నాయన్న మాట నిజం అనుకోనేలా ఉంది ఆయన స్పందన.కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ కొన్ని సందర్భాల్లో నేరుగా వెళ్లి మాట్లాడారు.

# ఇప్పుడు టార్గెట్ చైనా...

న్యూఢిల్లీ, జూలై 8, (న్యూస్ పల్స్) ఇప్పటికే ఆర్థిక వ్యవస్థలో జర్మనీ దేశాన్ని పక్కన పెట్టాం. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. భవిష్యత్ కాలంలో చైనాను అధిగమించబోతున్నాం. అమెరికాకు దగ్గరగా వెళ్లబోతున్నాం.. ఆర్థికంగా ఎదగడం మాత్రమే కాదు.. రక్షణ పరంగా కూడా అంతే స్థాయిలో వృద్ధిని సాధించబోతున్నాం. ఇదేదో అడ్డగోలుగా చెబుతున్న మాట కాదు. సరదాగా చేస్తున్న వ్యాఖ్య అంతకన్నా కాదు. ఇటీవల పాకిస్తాన్ పై ఆపరేషన్ సిందూర్ తర్వాత మన సైనిక సామర్థ్యం.. మన ఆయుధ సామర్థ్యం.. ప్రపంచానికి తెలిసింది. ముఖ్యంగా యుద్ధ విమానాలను వాడటంలో మనం ఉపయోగిస్తున్న సాంకేతికత ప్రపంచానికి సరికొత్తగా కనిపించింది.

అయితే దీనిని ఇక్కడితోనే ఆపివేయాలని భారత ప్రభుత్వం అనుకోవడం లేదు. ఈ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసుకోవాలని భావిస్తున్నది. ఈ క్రమంలోనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థను భారతదేశం నిర్మించుకుంటున్నది.ఇప్పటికే డిఆర్డిఓ అత్యంత ఆధునికమైన ఆయుధాలను తయారు చేస్తున్నది. వచ్చే ఐదు సంవత్సరాలలో వివిధ రకాల 12 హైపర్ సోనిక్ యుద్ధ క్షిపణులు సిద్ధమవుతున్నాయి. ఇవి దాడి చేయడం మాత్రమే కాదు.. శత్రు దేశాల రక్షణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.

ప్రాజెక్టు విష్ణు లో భాగంగా డిఆర్డిఓ ఈ మిషన్ చేపడుతోంది.. డిఆర్డిఓ చేపడుతున్న మిషన్ లో హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్, హైపర్ సోనిక్ క్రూజ్ మిస్సైల్స్, హైపర్ సోనిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. దాడిలో అత్యంత వేగవంతమైన సామర్థ్యం.. అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానం వీటిలో ఉపయోగిస్తున్నారు. వీటి ద్వారా శత్రువులను అత్యంత బలంగా ఎదుర్కోవడం.. వెంటనే తుద ముట్టించడం వీటి లక్ష్యమని నిపుణులు చెబుతున్నారు.సరిగ్గా ఏడాది క్రితం డిఆర్డిఓ హైపర్ సోనిక్ మిస్సైల్ పరీక్షను అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా దేశ స్క్రామ్ జెట్ ఇంజన్ అభివృద్ధిలో ఇది కీలకమైన రాయిగా నిలిచింది.. అంతేకాదు ఈ వ్యవస్థలను అభివృద్ధి చేసి చైనా, రష్యా, అమెరికా స్థాయిలో భారత్ నిలిచింది. లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ కెపాసిటీ ఉన్న మోస్ట్ పవర్ఫుల్ కంట్రీస్ లో మన దేశం ఒకటిగా నిలిచింది. ధ్వని కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణించే కెపాసిటీ ఉన్న ఆయుధాలను హైపర్ సోనిక్ అని పిలుస్తుంటారు. ఇలాంటి క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశం వద్ద లేదు. అయితే ఇటువంటి అత్యాధునిక హైపర్ సోనిక్ వెపన్స్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది.

వీటిని ఆర్మీ, నేవి, వాయు సేన కోసం డెవలప్ చేస్తోంది.ఇందులో ఫస్ట్ టైం ఎక్స్టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. స్క్రామ్ జెట్ ఇంజన్ తో మాక్- 8 స్పీడ్ ను రీచ్ అయ్యే విధంగా దీనిని డెవలప్ చేస్తున్నారు. ఇది 2,500 కిలోమీటర్ల వరకు ఉన్న టార్గెట్ లను చేజ్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు 2030 కల్లా వీటిని మన ఆర్మీలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఆయుధాలు మన ఆర్మీకి ఐదు సంవత్సరాల కాలంలో అందుబాటులోకి వస్తాయి. ఇవన్నీ కూడా మన దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి.

అప్పుడు శత్రు దేశాలు మన మీద దాడి చేయాలంటే ఆలోచిస్తాయి. అంతేకాదు బలమైన దేశాల కంటే మనమే ముందు వరుసలో ఉంటాం. అన్నిటికంటే ముఖ్యంగా రక్షణ వ్యవస్థలో అమెరికాతో సమానంగా ఉంటాం.

## గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలి..

### తన శాఖలపై మంత్రి వాకిటి శ్రీహరి అసంతృప్తి

కరీంనగర్, జూలై 8 లేకలేక మంత్రి పదవి వచ్చింది. కానీ మంత్రి పదవి స్వీకరించిన కొన్ని రోజులకే నాకు ఇలాంటి శాఖలు కేటాయిస్తే ఏం చేసుకోవాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు వాకిటి శ్రీహరి. గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలో అర్థం కావడం లేదని.. నాశనం అయిన శాఖలను కేటాయించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు కేటాయించిన శాఖలపై కరీంనగర్లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పదేళ్లలో పూర్తిగా నాశనం అయిన శాఖలను తనకు అప్పగించారని అన్నారు. యువజన సర్వీసులు, పశుసంవర్ధక శాఖలు ఇస్తే నేనేం చేసుకోవాలి. గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలి అంటూ మంత్రి వాకిటి శ్రీహరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు కేటాయించిన మొత్తం శాఖలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, తన అదృష్టమో లేక దురదృష్టమో అర్థం కావడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. వాకిటి శ్రీహరి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించినా అదృష్టం వరించింది. తెలంగాణ కేబినెట్ మంత్రి అయ్యారు. సామాజిక సమీకరణం కలిసి రావడంతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తొలి ప్రయత్నంలోనే మంత్రి పదవితో జాక్ పాట్ కొట్టారు. మేజర్ పంచాయత్ మక్తల్ సర్పంచ్ గా విజయం సాధించిన వాకిటి శ్రీహరి అంచెలంచెలుగా ఎదిగి గత అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ ఎమ్మెల్యే అయ్యారు. ముదిరాజ్ లకు కేబినెట్ లో బెర్త్ ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం ఫిక్స్ కావడంతో రాష్ట్ర మంత్రి అయ్యారు. మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా చేసిన వాకిటి శ్రీహరి జిఖుఅ మక్తల్ గా తెలంగాణలో రెండో అత్యధిక మెజార్టీ తెచ్చుకున్నారు. తరువాత మహబూబ్ నగర్ జిల్లా జిల్లా పరిషత్ లో కాంగ్రెస్ పార్టీ జిఖ ఫ్లోర్ లీడర్ గా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేట్ ఎన్నికలలో ఇంఛార్జ్ గా చేశారు. 2023లో జరిగిన ఎన్నికల్లో మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొంది, తొలి ప్రయత్నంలోనే మంత్రి అయ్యారు. కానీ తనకు కేటాయించిన శాఖలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతోంది

## ఏపీ సర్కార్ లో పనిచేయలేమంటున్న ఐఏఎస్, ఐపీఎస్ లు

### కేంద్రానికి వరస ఫిర్యాదులు

విజయవాడ జూలై 8, ఏపీ ప్రభుత్వం తీరుపై కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆగ్రహంగా ఉన్నారా? కక్ష సాధింపునకు దిగుతోందని ఆందోళనతో ఉన్నారా? ఏపీ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారా? మరి కొందరు నేరుగా కేంద్రానికి ఫిర్యాదు చేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అందుకు బలం చేకూరుస్తున్నాయి. రెండు రోజుల కిందట ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీనామాకు సిద్ధపడిన సంగతి తెలిసిందే. వాలంటరీ రాజీనామాతో పెద్ద ప్రకంపనలు సృష్టించారు. అయితే ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వ బాధిత ఐఏఎస్, ఐపీఎస్ లు కేంద్రానికి భారీగా ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీలో కూటమి ప్రభుత్వ తీరు బాగాలేదని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారట.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. వైసిపి హయాంలో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్న అధికారులపై ఫోకస్ పెట్టింది కూటమి. అప్పటి వైసిపి ప్రభుత్వ పెద్దలతో అంటగాకి తమను ఇబ్బంది పెట్టిన వారిని పోస్టులు ఇవ్వకుండా చేసింది. కొందరిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో చాలామంది ఇతర రాష్ట్రాల్లో పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేశారు. మరికొందరైతే స్వచ్ఛంద పదవీ విరమణకు ప్రయత్నించారు. అందుకు అంగీకారం తెలపక పోగా కొంతమంది పై కేసులు కూడా నమోదయ్యాయి. నీతో బాధిత అధికారులంతా కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చాలామంది అధికారులను పక్కన పెట్టింది. వారికి పోస్టింగులు ఇవ్వలేదు. రాష్ట్రంలోనే సీనియర్ అధికారిగా గుర్తింపు సాధించిన శ్రీలక్ష్మి కి పోస్టింగ్ ఇవ్వలేదు. చీఫ్ సెక్రటరీ అర్హత జాబితాలో ఆమె తొలి స్థానంలో ఉన్నారు. జగన్ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేశారు సీనియర్ ఐఏఎస్ అధికారి ముత్యాలరాజు. ఆయనకు సైతం పోస్టింగ్ ఇవ్వలేదు. మురళీధర్ రెడ్డి, మాధవి లత, నీలకంఠ రెడ్డికి ఇప్పటివరకు పోస్టింగ్ ఇవ్వలేదు. ఐపీఎస్ లపై సైతం అదే ధోరణి కొనసాగింది. రఘురామిరెడ్డి, విశాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి పై కక్ష సాధింపు చర్యలకు దిగిందన్న విమర్శలు ఉన్నాయి. పీఎస్ఆర్ ఆంజనేయులు, సంజయ్, పీవీ సునీల్, క్రాంతి రానా, విశాల్ గున్నీలపై సైతం సక్సెస్ సాధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఐపీఎస్ అధికారి వాలంటరీ రిటైర్మెంట్ వైపు మొగ్గు చూపినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ తరుణంలో ప్రభుత్వ బాధ్యత అధికారులంతా కేంద్రానికి ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. మరి కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# రియల్ కుంభకోణం.. స్టార్ హీరో మహేష్ బాబుకు మరో నోటీసులు



హైదరాబాద్ జూలై 8, సినీ సెలబ్రిటీలు ప్రముఖ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్లు గా వ్యవహరించి చిక్కుల్లో పడుతున్నారు. ముఖ్యంగా సూపర్ స్టార్ మహేష్ బాబు గురించి మాట్లాడుకోవాలి. రీసెంట్ గానే ఆయన శ్రీ సాయి సూర్య డెవలపర్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ కు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించడం, కానీ ఆ సంస్థ మనీ లాండరింగ్ కేసులో చిక్కుకోవడంతో ఈడీ అధికారులు మహేష్ బాబు ని విచారణకు హాజరు కావాలని ఆదేశించడం వంటివి జరగడం మనమంతా చూసాము. అయితే మహేష్ బాబు విచారణకు హాజరు అయ్యాడో లేదో, అసలు ఈ వ్యవహారం ఎక్కడి దాకా వెళ్ళింది అనేది ఎవరికీ తెలియదు. ఈ అంశాన్ని అందరూ మర్చిపోయారు కూడా. కానీ ఇంతలోపే మరో రియల్ ఎస్టేట్ కుంభకోణం లో మహేష్ బాబు చిక్కుకున్నాడు. అయితే సాయి సూర్య డెవలపర్స్ సంస్థ మహేష్ బాబు యాడ్స్ ని ప్రచారం చేయడం వల్ల రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక మహిళ ఒక లే అవుట్ లో ఫ్లాట్స్ ని కొనుగోలు చేసిందటఒక్కో ఫ్లాట్ కి 34 లక్షల రూపాయలకు పైగా డబ్బులు తీసుకున్నారని, తీరా చూస్తే కొన్న ఫ్లాట్స్ మా పేరు మీద రిజిస్టర్ చేయడానికి అనుమతించలేదని ఆమె ఆరోపించింది. దీంతో కట్టిన డబ్బులను వెంటనే వెనక్కి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేయడంతో సాయిసూర్య డెవలపర్స్ సంస్థ ఎండీ సతీష్ చంద్రగుప్తా ఆమెకి కేవలం 15 లక్షలు మాత్రమే చెల్లించారట. మిగిలిన డబ్బుల కోసం అడిగితే అసలు అందుబాటులోకి రాలేదని ఆమె తన ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఆమె రంగారెడ్డి కన్సూమర్ ఫోరమ్ లో ఫిర్యాదు చేసింది. ఆమె పిటీషన్ ని క్షుణ్ణంగా పరిశీలించిన ఫోరమ్ అధికారులు సతీష్ గుప్త తో పాటు, ఆ యాడ్ ని ప్రమోట్ చేసిన మహేష్ బాబు కి నోటీసులు జారీ చేశారు. జులై 8న మీ న్యాయవాదులతో పాటు ఫోరమ్ ఎదుట హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.మరి మహేష్ బాబు ఈసారైనా విచారణకు హాజరు అవుతాడా?,లేక కేవలం తన న్యాయవాదులను పంపి సరిపెడుతాడా అనేది తెలియాల్సి ఉంది. ఈ అంశంపై సోషల్ మీడియా లో నెటిజెన్స్ మహేష్ బాబు పై తీవ్రమైన ట్రోల్స్ వేస్తున్నారు. ఇంకా ఇలాంటివి ఎన్ని చేసావు బాబు అంటూ ఆయన్ని ట్యాగ్ చేసి ప్రశ్నిస్తున్నారు. మరి దీనిపై మహేష్ బాబు కానీ, ఆయన టీం కానీ రెస్పాన్స్ ఇస్తుందో లేదో చూడాలి. ప్రస్తుతం మహేష్ బాబు రాజమౌళి తో ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. శరవేగంగా రెండు ప్రధానమైన షెడ్యూల్స్ ని పూర్తి చేసుకున్న ఈ చిత్రం అప్పుడే పాతిక శాతం షూటింగ్ ని పూర్తి చేసుకుందట. ఆగష్టు 9 న మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుండి ఒక గ్లింప్స్ వీడియో ని విడుదల చేయబోతున్నారట మేకర్స్.

# తెరపైకి కన్నెపల్లి పంపుహౌస్ వివాదం

కరీంనగర్, జూలై 8 అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల మధ్య ఇటీవలి కాలంలో అనేక అంశాలపై మాటల యుద్ధం సాగుతోంది. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రెండు పార్టీల వాగ్వాదం జరుగుతుండగానే, తాజాగా కన్నెపల్లి పంపుహౌస్ వివాదం రెండు పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంపుహౌస్‌ను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుండగా, పంపుహౌస్ ఎప్పుడు ప్రారంభించాలో తమకు తెలుసని కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడి చేస్తోంది. ఈ కన్నెపల్లి పంపు విషయంలో ప్రస్తుత, మాజీ నీటిపారుదల శాఖ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్ రావుల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది.కాళేశ్వరంలోని కీలకమైన కన్నెపల్లి పంపుహౌస్‌లోని మోటార్లు 2022 గోదావరి వరదల్లో మునిగి పాడయ్యాయి. రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో తీవ్ర నష్టం జరిగింది. వీటిని మరమ్మతు చేసి పునరుద్ధరించడానికి వందల కోట్లు అవసరమని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇదిలా ఉండగా, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పి.సి. ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ వేసి విచారణ జరుపుతోంది. ఈ విచారణకు కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన ఇంజనీర్లు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు, మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ కమిషన్ నివేదిక ఆధారంగానే కాళేశ్వరం ప్రాజెక్టు విషయాల్లో ముందుకు సాగాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయించుకుంది. ప్రస్తుతం కన్నెపల్లి పంపుహౌస్ మోటార్ల మరమ్మతు పనులు సాగుతున్నట్లు సమాచారం.గోదావరి నదిలో ప్రస్తుతం నీటి ప్రవాహం ఉన్నా కేవలం రాజకీయ కక్షతో కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లు ఆన్ చేయడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. "గోదావరిలో నీళ్లున్నాయి. మేడిగడ్డ బ్యారేజీ గేట్లు తెరిచి ఉన్నా, కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా రోజుకు 2 టీఎంసీల (వేల మిలియన్ క్యూబిక్ అడుగులు) నీటిని ఎత్తిపోయవచ్చు. రైతులు సాగునీరు లేక అల్లాడుతున్నారు. వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు న్యాయం చేయాలి," అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ రాజకీయానికి వాడుకుంటోందని హరీశ్ రావు విమర్శిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అవసరమని, ఇప్పుడు నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని హరీశ్ రావు వాదన.మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లలో లోపాలు, కన్నెపల్లి పంపుహౌస్ నీట మునగడం వంటివి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అవినీతికి నిదర్శనమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎదురుదాడికి దిగుతున్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం కమిషన్ల కోసం, వారి దోపిడీ కోసం కట్టింది. మామూలు పగుళ్లు కావు, మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లే కుంగిపోయాయి. అలాంటి ప్రమాదకరమైన నిర్మాణాలను మేము ఎలా నమ్మగలం? వాటిని సరిదిద్దకుండా, ప్రాజెక్టు భద్రతను నిర్ధారించుకోకుండా నీటిని ఎత్తిపోవడం అంటే రైతుల ప్రాణాలతో, ఆస్తులతో చెలగాటమాడటమే అవుతుంది," అని మంత్రి ఉత్తమ్ ఘాటుగా స్పందించారు. "కాళేశ్వరం కమిషన్ నివేదిక వచ్చేవరకు, నిపుణుల కమిటీ అనుమతి లేకుండా పంపుహౌస్‌లను పూర్తిగా ఆన్ చేయలేము. ఇది రాజకీయ నిర్ణయం కాదు, ప్రజల భద్రతకు సంబంధించినది," అని ఉత్తమ్ కుమార్ రెడ్డి కుండబద్దలు కొట్టి చెప్పారుఇలా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం సాగుతుంటే, వర్షాలు ఆశించిన రీతిలో రాకపోవడం, కన్నెపల్లి పంపుహౌస్ నుండి నీటి విడుదల కాకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు పార్టీలు రాజకీయాలకతీతంగా సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం సైతం తమ సమస్యను దృష్టిలో పెట్టుకుని స్పందించాలని కోరుతున్నారు.

# కోనరావుపేట మండలంలో డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్యశాఖ అధికారి.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ), తేదీ 08-07-2025** మంగళవారం రోజున జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత డ్రైడేలో భాగంగా కొనరావుపేట మండలంలోని కనగర్తి గ్రామం మరియు కోనరావుపేట మండల కేంద్రంను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత మాట్లాడుతూ కాలానుగున వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, రక్షిత మంచినీరు, మంచి పోషకాహారం తీసుకోవడం, డ్రై డే పాటించడం వల్ల వ్యాధుల నివారణకు ప్రజలు కృషి చేయాలని అన్నారు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డాక్టర్.అనిత, ప్రోగ్రాం ఆఫీసర్ ( ఎన్ సి వి బి డి సి ), సిహెచ్ఓ బాలచంద్రం, హెచ్ లింగం మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, 2007 ను పకడ్బందీగా అమలు.

## రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ) ఎన్. వెంకటేశ్.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 8 :** ములుగు జిల్లాలో తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం, 2007 ను పకడ్బందీగా అమలుచేస్తున్నామని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ) ఎన్. వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తల్లిదండ్రులు, వృద్ధుల హక్కులు, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు డివిజన్ లోని తాహసీల్దార్లు, న్యాయ బృందాలతో సమన్వయం చేసుకుంటూ గత 6 నెలల్లో 28 ఫిర్యాదులను స్వీకరించి 24 ఫిర్యాదులకి ఉత్తర్వులు జారీ చేయగా మిగతా 4 విచారణ దశలో ఉన్నాయని ఆయన తెలిపారు.

పరిష్కరించిన ఫిర్యాదులలో 2 కేసులలో వారసుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయబడిన భూములను తిరిగి వారి తల్లితండ్రులు పేరు మీద బదిలీ చేయడానికి ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు.

వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేసిన వారసులకు నెలలవారీ పోషణ ఖర్చుగా రూ.3000/- నుంచి రూ.10,000/- వరకు సంబంధిత తల్లిదండ్రులు/ వృద్ధుల ఖాతాలో జమ చేయాలన్న ఆదేశాలు జారీతో అనేక కేసులు విజయవంతంగా పరిష్కారమై, వృద్ధుల పోషణ మరియు రక్షణ సుస్థిరంగా అమలయ్యాయి. వృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన లేదా వేధింపులకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ స్పష్టం చేశారు.

పోషణ ఖర్చులు చెల్లించని వారసులపై తల్లిదండ్రులు పోషణ, వృద్ధుల సంక్షేమ చట్టం, 2007 ప్రకారం ఒక నెల జైలు శిక్ష విధించబడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంలో తహశీల్దార్లకు వ్యక్తిగతంగా ఇటువంటి కేసులను పర్యవేక్షిస్తూ చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలందరూ వృద్ధులను గౌరవించి, వారి సంక్షేమం కోసం సహకరించాలని ఆర్డీఓ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేసారు.

వృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన లేదా వేధింపులకు పాల్పడ్డవారిపై ఫిర్యాదులు ఇవ్వాలనుకున్న వృద్ధులు తాహసీల్దార్ లేదా ఆర్డీఓ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చని ఆర్డీఓ పేర్కొన్నారు.

# ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలి.

## రైతులకు ఆయిల్ పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలి.

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 8 : ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలని, రైతులకు ఆయిల్ పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులకు సూచించారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తో కలిసి ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణము, ప్రాసెసింగ్ ఇండస్ట్రీ (ఫ్యాక్టరీ) నిర్మాణము పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఆయిల్ పామ్ పంట సాగు పై, ఆయిల్ ఫామ్ కంపెనీ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అవసరమైన డాక్యుమెంట్స్, పర్మిషన్స్, మౌలిక వసతుల కల్పన, కావలసిన ఏర్పాట్ల పై వివరంగా జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ హార్టికల్చర్ సహకార, సంఘాల బలోపేతం, రైతుల సౌకర్యార్థం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు.పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలని సూచించారు. పామ్ ఆయిల్ పంట సాగు ద్వారా రైతులకు అనేక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయితీల వివరాలను తెలియపరచాలన్నారు.

జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యమునకు మించి సాధించాలని, లబ్ధిదారుల ఎన్నిక, రైతుల నుండి దరఖాస్తులను, రైతు వాటా సేకరణ, ప్లాంటేషన్ పూర్తి, మొదలగు పనులను, ఆయిల్ ఫామ్ కంపెనీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం లక్ష్య%శీ% 3000 ఎకరాలు సాధించడానికి వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు కలిసి ఒక నిర్దిష్ట ప్రణాళికలు తయారు చేసి ఈ మొదటి సీజన్ లోనే 75% లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి వారంలో బుధవారం, శనివారం గూగుల్ మీట్ ఏర్పాటు చేసి తద్వారా ప్రగతిని వివరించాలని, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారిని ఆదేశించారు.

జిల్లాలో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయింపు, సంబంధించిన అనుమతులు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు త్వరగా చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డి. సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారిసిద్ధార్థ రెడ్డి, డి ఈ ఆర్ డబ్లు ఎస్ వెంకట సతీష్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, కే.ఎన్ బయోసైన్స్ ఏరియా మేనేజర్ హేమంత్ కుమార్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ (%వీ×జు%) వి.వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ వైఎస్ఆర్ 76 వ జయంతి వేడుకలు



ప్రజాబలం మంచిర్యాల డాక్టర్ వైఎస్ఆర్ 76వ జయంతి సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గం మంచిర్యాల పట్టణంలోని ఎమ్మెల్యే వారి నివాసంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రికీ,,శే,,డాక్టర్,,రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా వారి చిత్రం పటానికి నివాళులు అర్పించి,కేక్ కట్ చేసిన మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ...రాజశేఖరరెడ్డి గారు నాకు అత్యంత సన్నిహితులు,ఈ రోజు వారు లేకపోవడం చాలా బాధాకరం అన్నారు.ముఖ్యమంత్రిగా వైఎస్ ఆర్ అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరకాలం నిలిచిపోతాయి తెలిపారు..ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు,మహిళా నాయకురాలు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ తో టీడీపీ చెట్టా పట్టాల్...?

హైదరాబాద్, జూలై 8, తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అత్యంత కీలకంగా మారింది. మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ గెలుపు కోసం అన్ని రకాల వ్యూహాలను అమలు చేస్తున్నాయి. మూడు పార్టీలకూ ఉపఎన్నిక అత్యంత కీలకమే. ఎవరు గెలిస్తే వారికి ప్రజామోదం లభిస్తోందన్న ప్రచారం జరుగుతోంది. అందుకే ఆరు నూరైనా జూబ్లిహిల్స్‌లో గెలవాలన్న పట్టుదలగా అన్ని పార్టీలు ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీకి జూబ్లిహిల్స్ ఉపఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకం. ఇది ఆ పార్టీకి సిట్టింగ్ సీటు. ఇప్పటికే సిట్టింగ్ సీటు కంటోన్మెంట్ ను ఆ పార్టీ కోల్పోయింది. ఇప్పుడు జూబిహిల్స్ కోల్పోతే .. ఇప్పటికే ఆ పార్టీ పరిస్థితి డెడ్ అయిందని అది మరోసారి నిరూపితం అయిందని కాంగ్రెస్ నేతలు ఎగతాళి చేయడం ప్రారంభిస్తారు. అందుకే జూబ్లిహిల్స్ ఉపఎన్నికను బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కేసీఆర్ సీరియస్ గా తీసుకున్నారు. మాగంటి గోపీనాథ్ మొదట తెలుగుదేశం పార్టీ తరపున గెలిచారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి టీడీపీలో ఉన్న ఆయన.. 2014లో పోటీ చేసే అవకాశాన్ని పొందారు. విజయం సాధించారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మరో రెండు సార్లు గెలిచారు. అయితే ఈ రెండు సార్లు గెలుపులో ఆయనకు టీడీపీ సానుభూతిపరుల సపోర్టు బాగా ఉపయోగపడింది. అయితే మజ్లిస్ పార్టీ మద్దతు కూడా ఉపయోగపడింది. మాగంటి గోపీనాథ్ కోసం.. టీడీపీ సానుభూతిపరులు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి ఉంటారని. ఈ సారి ఎవరు అభ్యర్థి అయినా బీఆర్ఎస్ కు ఓటు వేయరన్న ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో మజ్లిస్ పార్టీ కూడా బీఆర్ఎస్ పార్టీకి దూరం అయింది. ఈ క్రమంలో టీడీపీ మద్దుత కోసం కేసీఆర్ ప్రయత్నించారని కాంగ్రెస్ నేత సామ రామ్మోహన్ రెడ్డి ఆరోపణలు చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో లోకేష్ హాజరయినప్పుడు.. కేటీఆర్ కూడా వెళ్లారని.. అక్కడ అర గంట సేపు చర్చలు జరిపారని అంటున్నారు. మొత్తం రెండు సార్లు సమావేశం జరిగిందని అంటున్నారు. మాగంటి గోపీనాథ్ కుటుంబసభ్యులకే టిక్కెట్ ఇస్తామని.. టీడీపీ తరపున సహకరించాలని కోరినట్లుగా చెబుతున్నారు. అయితే ఈ అంశంపై బీఆర్ఎస్ వర్గాల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఖండించడం కూడా చేయలేదు. ఈ అంశంపై స్పందిస్తే ఇంకా ఎక్కువ ప్రచారం జరుగుతుందన్న ఉద్దేశంతో సైలెంట్ గా ఉన్నారని అంటున్నారు. అయితే అంతర్గతంగా మాత్రం.. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో టీడీపీ ప్రభావం ఏమి ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. టీడీపీకి ఎంత మద్దతు ఉంటుదో వైసీపీకీ అంతే ఉంటుందని తమ పార్టీకి ఎప్పుడూ వైసీపీ మద్దతుగానే ఉంటుందని గుర్తు చేస్తున్నారు. లోకేష్ ను మద్దతు అడిగే పరిస్థితి రాదని చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ వర్గాలు కూడా ఇంకా స్పందించలేదు.

## మంత్రి జూపల్లికి జర్నలిస్టుల కృతజ్ఞత సభ

## విలేకరులను ఒక పార్టీకి అంటగట్టడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం




మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలోని గుర్తించిన 130 మంది జర్నలిస్టులలో 15 మందిని మినహాయించి 115 మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు పోరాడుతాం టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ

కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ గత నెల 25 నుంచి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి సందర్భంగా మంగళవారం రోజు అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి లతో కలిసి విలేకరుల సమావేశంలో కొల్లాపూర్ లో దీక్షలు చేస్తున్న జర్నలిస్టుల గురించి అబద్దాలను సైతం అందంగా వివరించేందుకు ఆలస్యంగా అయినా స్పందించినందుకు దీక్ష శిబిరంలో మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞత సభ నిర్వహించారు. టిడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిజెపి నాయకుడు దళిత నేత బంకల వెంకటస్వామి మాట్లాడుతూ

జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారం లేక ముందు ఒక మాట మాట్లాడిండు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకొక మాట మాట్లాడుతున్న మీరు చాలా తప్పు చేస్తున్నారని బిజెపి పార్టీ నుంచి తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ మాట్లాడుతూ ఈ సోమవారం రాష్ట్ర మంత్రివర్యులు స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు అచ్చంపేట తాలూకాలో పక్క నియోజకవర్గంలో నాగర్కర్నూలు ఎమ్మెల్యే అచ్చంపేట ఎమ్మెల్యే ఇంకో మంత్రివర్యులు శ్రీనివాస్ రెడ్డి లతో చెంచులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి అచ్చంపేటకు వెళ్లారు కొల్లాపూర్ నియోజవర్గానికి చెందిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల డిమాండ్ ను గుర్తించి మాట్లాడారు అంటే జర్నలిస్టుల పైన ఎంత ప్రేమ ఉందనేది అర్థమవుతుందన్నారు. సొంత నియోజకవర్గంలో 13 రోజులపాటు రిలే దీక్షలు చేసిన అనంతరం ఇప్పటికైనా స్పందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలో 130 మంది జర్నలిస్టులు ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియా ఉన్నారని వారి యొక్క వ్యక్తిగత వివరాలను కూడా తీసుకున్నా మంత్రి అర్హులైన వారు ఎంతమంది జర్నలిస్టులు ఉన్నారో వారి అందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కుల ప్రకారం స్థలాన్ని అడుగుతున్నామని పేర్కొన్నారు. జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఒక పెద్ద సమావేశాన్ని ఏర్పాటు చేసి 1100 మంది జర్నలిస్టులకు హైదరాబాద్లో మీ ముఖ్యమంత్రి పాల్గొని పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు ఆ పట్టాలు బిపిఎల్ కింద ఇచ్చారా జర్నలిస్టు కోటా కింద ఇచ్చారా అనే విషయాన్ని మంత్రి జూపల్లి ఒక్కసారి గుర్తించుకుంటే మంచిదని వారు సూచించారు. సామాజిక స్పృహ ఉన్నవాళ్లు జర్నలిస్టులని సామాజిక స్పృహతో ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల పక్షాన నిలబడిన జర్నలిస్టులకు మీరు ఏ రకమైన పేర్లు పెట్టినా మాకు అభ్యంతరం లేదన్నారు. చింతించాల్సిన విషయం ఏమిటంటే మంత్రి జూపల్లి కృష్ణారావు రాజకీయాల్లోకి వచ్చిన రోజు నుంచి జర్నలిస్టుల సలహాలు తీసుకొని వాళ్లతో వార్తలు రాయించుకున్నారో వాళ్ళ సలహాలు సూచనలు పాటించారో అలాంటి వారు దీక్షలో కూర్చున్నారని మీకు గుర్తు చేస్తున్నానన్నారు 15 మందికి కాకుండా మిగిలిన 115 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు.

పెంట్లవెల్లి సీనియర్ రిపోర్టర్ శివ మాట్లాడుతూ మా హక్కుల కోసం మేము పోరాడుతున్నామని కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమకారులకు ఎమ్మెల్యేలకు ప్లాట్లు పొందినట్లు తెలిపారు మీరు ఎమ్మెల్యేగా మంత్రిగా ఉండి కూడా మీరు ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం పొందినప్పుడు జర్నలిస్టులు ఎందుకు ఇళ్ల స్థలాలకు అర్హత గారు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలపాలన్నారు.

టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు రామచంద్ర మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న విషయాలను పదిమందికి తెలియాలని జర్నలిస్టులు వార్తలు రాస్తుంటారన్నారు. పత్రిక విలేకరులు చాలామంది గత 30 సంవత్సరాలుగా అన్ని పార్టీలకు అన్ని నాయకులకు వార్తలు రాశారన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న జర్నలిస్టులు మీకు నచ్చకుంటే పోరాటం చేస్తున్న 15 మంది జర్నలిస్టులకు మీరు ఇళ్ల స్థలాలు ఇవ్వకున్నా బాధపడేది లేదు కానీ మిగిలిన 115 మందికి ఇంటి స్థలాలు ఇవ్వాలని అంతవరకు మా పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పెద్ద కొత్తపల్లి సీనియర్ జర్నలిస్టు మల్లేష్ కూడా మాట్లాడారు. ఈ దీక్షలలో సీనియర్ జర్నలిస్టు బచ్చలకూర కురుమయ్య, సిపి నాయుడు, రమణౌజీరావు కారంకి గోవిందు, కళ్లెపు భాను ప్రకాష్, బాబు, గోపాసి కేశవులు, స్వాములు, సురేందర్ తరుణ్ ఉన్నారు.

## బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని రౌడీ షీటర్లకి ఏసీపీ కౌన్సెలింగ్..



**కూకట్పల్లి (ప్రజబలం) జులై :08**బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు మంగళవారం బాలానగర్ ఏసీపీ పి. నరేష్ రెడ్డి, సీఐ నర్సింహా రాజు తోకలసి కౌన్సెలింగ్ ఇచ్చారు. రానున్న బోనాలు వేడుకల దృష్టిలో ఉంచుకొని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో ఉన్న 8 మంది రౌడీషీటర్లకు సస్పెక్ట్ షీటర్లకు ఈ రోజు బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని ఏసిపి నరేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వీరిపై పోలీసు నిఘా కూడా ఉందని పేర్కొన్నారు. వచ్చే బోనాలు పండుగ వేడుకలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని, హుందాగా జీవించాలని సూచించారు. నేరస్తుల తొందరపాటులో నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండే వారిపై షీట్ ఎత్తివేసే అవకాశం ఉందని ఆఫర్ ఇచ్చారు, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మారండని రౌడీ షీటర్లకు ఏసీపీ హితవు పలికారు. ఎస్ఐలు సరళ, వినోద్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమీక్ష




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 8:**ఆన్ లైన్ ద్వారా భూభారతి లో వచ్చిన దరఖాస్తులను, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి మేడ్చల్ తహసీల్దారును ఆదేశించారు.

మంగళవారం జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి మేడ్చల్ ఎంఆర్ఓ కార్యాలయంలో భూభారతి, రెవెన్యూ సదుస్సులు, మీ సేవా సర్టిఫికెట్ల జారీ వంటి అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ రెవెన్యూ సదుస్సులలో తీసుకున్న దరఖాస్తులు, ఆన్ లైన్ ద్వారా భూభారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, అందులో ఎన్ని పరిష్కరించారని ఎంఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో అవసరమైతే క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిర్వహించాలని అదనపు కలెక్టరు సూచించారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల గురించి ఎంఆర్ఓ ను అదనపు కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. మీ సేవ ద్వారా జారీ చేసే సర్టిఫికెట్ల గురించి ఆరా తీస్తూ, సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించి ధృవీకరణలు జారీ చేయాలన్నారు. కార్యాలయ ఫైళ్లను అదనపు కలెక్టరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎంఆర్ఓ భూపాల్, ఎంఆర్ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన సదస్సు




**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 8 (ప్రజాబలం ప్రతినిధి)** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని 19వ వార్డులో గల పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ లో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జ్ కం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. గృహహింస మరియు మహిళలు ఎదుర్కొంటున్న అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు,గుర్రం ఆంజనేయులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఈ.జ్యోతి, గెంట్యాల భూమేష్, తిరుపతి, అనుష, అరుణ, అలేఖ్య , కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, ఆర్పిలు జి.జ్యోతి, డి.అనుష, టి.కావ్య, వార్డు మహిళలు పాల్గొన్నారు.

## విద్యాలయం, అంగన్వాడి కేంద్రంలో మరమ్మత్తు పనులు.

### మండేపల్లి లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఇటీవల ఆకస్మిక తనిఖీ.

### కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు పూర్తి.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, తంగళ్ళపల్లి, ( ప్రజాబలం ),** తంగళ్ళపల్లి మండలం మండేపల్లి లోని విద్యాలయాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశాల మేరకు మరమ్మత్తు పనులు పూర్తి చేశారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాల్లో కలెక్టర్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో మరమ్మత్తులు, అంగన్వాడి కేంద్రంలో స్లాబ్ నుంచి నీరు కారుతూ పాఠశాల రెండు వరంగల్ లో గోడలు లేక ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ గుర్తించారు.

సమస్యలకు పరిష్కారం.

తంగళ్ళపల్లి మండలం మండేపల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండు వరండాల్లో 22వేలతో గోడలు నిర్మించి, ప్లాస్టరింగ్ పనులు, అలాగే బడి పేరు బోర్డు రిపేర్ చేయించి బిగించారు. అంగన్వాడీ కేంద్రంలో 20వేల రూపాయలతో స్లాబ్ కు మరమతులు పూర్తిచేసి, సీలింగ్ ఫ్యాన్ వినియోగంలోకి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తనకి తో తమ విద్యాలయాల్లో సమస్యలు పరిష్కారం కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

కిచెన్ షెడ్ నిర్మాణ పనులు.

వేములవాడ మండలం చింతల్టన ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశాల మేరకు కిషన్ షెడ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. విద్యార్థులకు ఆహార పదార్థాలు ఇదే గదిలో సిద్ధం చేయనున్నారు. విద్యాలయం సమీపంలోని అంగన్వాడి కేంద్రంలో కలెక్టర్ సూచనలు మేరకు వన మహోత్సవంలో మొక్కలు నాటారు.

## ప్రభుత్వ స్కూళ్ల లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు

### రాష్ట్రంలోనే ప్రథమంగా జిల్లాలో అమలు

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### సిరిసిల్ల గీతానగర్ బడిలో షురూ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై - 08 (ప్రజా బలం ప్రతినిధి)**జిల్లాలోని 458 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జెడ్పి.హెచ్.ఎస్ లో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. విద్యార్థులకు కట్టెల పొయ్యి పై ఆహార పదార్థాలు సిద్ధం చేయవద్దని సూచించారు. దీంతో వాతావరణ కాలుష్యం, ఇతర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. జిల్లాలోని 458 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌ పై సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధముగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌ లపై సిద్ధం చేయనున్నారు. ఇందులో భాగంగా ముందుగా సిరిసిల్ల లోని గీతా నగర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ప్రారంభించారు.

## జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటా

### రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### టీవీ9 రిపోర్టర్ గార్దాసు ప్రసాద్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 50 వేల,విప్ స్వంతగా 20 ఆర్థిక సహాయం అందజేత

### పిల్లల పై చదువులకు, ప్రసాద్ తల్లిదండ్రుల వైద్యానికి భరోసా



**రాజన్న సిరిసిల్ల జిల్లా , జూలై - 08 (ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల నియోజకవర్గనికి చెందిన టీవీ9 రిపోర్టర్ గార్దాసు ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటానని

రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ప్రసాద్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందిగా విషయం తెలుసుకున్న విప్ మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని, విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా 20 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో కూడా ఈ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పిల్లల పై చదువులకు అండగా ఉంటానని తెలిపారు. వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రసాద్ తల్లిదండ్రుల ఆరోగ్య చికిత్సకు ప్రభుత్వం తరఫున సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప రెడ్డి, డి.పి.ఆర్.ఓ. వి.శ్రీధర్, ప్రింట్ %డ% ఎలెక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అందోల్ లోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పర్యటించిన త్రిష రాజనర్సింహా

### పాలిటెక్నిక్ కాలేజ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం

### రాజనర్సింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిష దామోదర్ రాజనర్సింహా వెల్లడి





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 8 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా : ఆందోల్ నియోజకవర్గంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో, రాజనర్సింహ ఫౌండేషన్ తమ (సిఎస్ఆర్ )నిధులతో, చేపట్టిన అభివృద్ధి పనులను, ఫౌండేషన్ చైర్మన్ త్రిష రాజనర్సింహ, పరిశీలించారు,ఈ సందర్భంగా ఆమె పాలిటెక్నిక్ విద్యార్థినులతో కలిసి కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలించారు, విద్యార్థినిలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు, పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, త్రిష రాజనర్సింహ, వారికి భరోసా ఇచ్చారు, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, దామోదర్ రాజనరసింహ, సహకారంతో, మహిళా పాలిటెక్నిక్ కళాశాలను, మోడల్ కాలేజీగా, తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని వారికి వెల్లడించారు, అందోల్ నియోజకవర్గంలో, విద్య వైద్య రంగాల అభివృద్ధికి, ఎంతో కృషి జరుగుతోందని, ఫౌండేషన్ చైర్మన్ త్రిష రాజనర్సింహ, వెల్లడించారు, రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు, పెద్దపీట వేస్తుందని, ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు...

## ప్రెస్ క్లబ్ దగ్గర పోలీసుల మోహరింపు

హైదరాబాద్ తెలంగాణలో రాజకీయ వేడి మరింత పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగంపై ఎవరు ఏం చేశారనే అంశంపై ఓపెన్ డిబేట్ కు సవాల్ విసరగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ సవాల్ను స్వీకరించారు. సీఎం ఎక్కడైనా వేదికను సూచిస్తే తాను చర్చకు సిద్ధమని స్పష్టంగా ప్రకటించిన కేటీఆర్, ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వద్ద తాను సిద్ధంగా ఉంటానని ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు కూడా ప్రెస్ క్లబ్కు రావచ్చన్న వార్తలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. విపరీతంగా అభిమానులు, పార్టీ కార్యకర్తలు అక్కడికి చేరే అవకాశా న్ని పరిగణనలోకి తీసుకుని, పోలీస్ శాఖ భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. కేటీఆర్ ముందుగా చెప్పిన ట్టు చింతమడక, కొడంగల్, గజ్వేల్ వంటి ప్రాంతాల్లో ఎక్కడైనా చర్చ జరపడానికి తాను సిద్ధమని ప్రకటించినప్పటికీ, సోమాజిగూడ ప్రెస్ క్లబ్ను వేదికగా ఎంపిక చేశారు. రాజకీయ చర్చ పేరుతో మొదలైన ఈ పరిణామం, పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసే సూచనలు కనిపిస్తున్నాయి.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం

## -ఐ.ఎన్.టి.యు.సి పట్టణ అధ్యక్షులు వడ్లకొండ రంజిత్ గౌడ్




ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 8 :గత పదేళ్లుగా వార్షిక కార్మిక సమావేశాలు పెట్టకుండా కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని,ఎంతో మంది ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నా కార్మిక చట్టాలను కాలరాసేవిధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక చట్టలకు నిరసనగా ఈనెల తొమ్మిదో తారీఖున జాతీయ కార్మిక సంఘాలు మరియు ప్రాంతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు చేపట్టిన సమ్మెను సంగటిత అసంగటిత కార్మికులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఐ.ఎన్.టి యు. సి మందమర్రి పట్టణ అధ్యక్షులు వడ్లకొండ రంజిత్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎన్టియుసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి, ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ మంచిరియాల్ జిల్లా అధ్యక్షులు రాంశెట్టి నరేందర్ సూచన మేరకు వారి ఆదేశానుసారం సమ్మెను విజయవంతం చేయడానికి ఐఎన్టియుసి ముందుండి పోరాడుతున్నదని కేంద్ర ప్రభుత్వం మోడీ నాయకత్వంలో ఆకాశంలో నడిచే విమానాలను సముద్రాల పై నడిచే నౌకలను భూమిపై నడిచే రైళ్లను భూగర్భ గనులను ఎల్ ఐ సిని మరియు చివరికి అంతరిక్షాన్ని సైతం ప్రైవేటికరణ చేసి ఆదానీ అంబానీలకు ఈ దేశ సంపదను శ్రామికశక్తిని దోచిపెట్టడానికి కుట్ర చేస్తున్నదని అందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా మార్చి కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడం కనీస వేతన చట్టాన్ని నీరుగార్చడం పనిగంటలను పెంచడం పిఎఫ్ ను కుదించడం పని ప్రదేశాల్లో రక్షణ లేకుండా చేయడం తదితర అంశాలను జోడించి తయారుచేసిన ఈ చట్టాల వలన కార్మిక సంఘాలు నిర్వీర్యమవ్వడమే కాకుండా సమ్మె చేసే హక్కును కూడా కార్మికులు కోల్పోతారని దానివలన కార్మికుల జీవితాలు దుర్భల్యమవుతాయని, అందుకే ఈ నెల 9న జరిగే సమ్మెను ఐక్యమత్యంతో అందరం పాల్గొని కార్మిక శక్తిని చూపాలని పట్టణ అధ్యక్షులు రంజిత్ గౌడ్ కోరారు.

## దోమల నివారణ పరిసరాల పరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు

## మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్..



హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 8 నీరు నిల్వ ఉన్న దోమ తన అండాలను విడుదల చేసి దోమల పెరుగుదల చేస్తుందని, దానిని నివారించడానికి మున్సిపాలిటీ పరిధిలోని హరితనగర్ లో మంగళవారం జమ్మికుంట మున్సిపల్ సిబ్బందితో కలిసి 100రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆయిల్ బాల్స్ నీటిలో విడుదల చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ రానున్న వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఈ ఆయిల్ బాల్స్ దోమ గుడ్లను ఎదగకుండా పూర్తిగా నిర్మూలిస్తుందన్నారు. జూన్ 2నుండి ప్రారంభమైన 100రోజుల ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి రోజు ఒక కార్యక్రమం చొప్పున మున్సిపాలిటీ మార్పు అభివృద్ధి వైపు అనే నినాదంతో ముందుకు అడుగులు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓపెన్ ప్లాట్లలో చెత్త చెదరలతో ఉన్నందున వారికి పలుమార్లు నోటీసులు ఇచ్చామని, వారి ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలుమార్లు తెలిపామన్నారు. అయిన పట్టించుకోని వారి ప్లాట్లను మున్సిపల్ పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులలో మున్సిపల్ ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు తిరుగుతూ ఎక్కడైతే రోడ్లు, డ్రైన్ అవసరం ఉన్నాయో వాటి వివరాలు సేకరించారని, వాటిని డీఎంఏ దృష్టికి తీసుకెళ్లడం జరిగినట్లు ఆయన తెలిపారు. బహుశా ఇంకో 15-20 రోజులలో నిధులు మంజూరు కావొచ్చని, నిధులు మంజూరు కాగానే వార్డులలో అవసరమయ్యే పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని కమిషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, సదానందం, ప్రజా ప్రతినిధులు సాయిని రవి, శ్రీపతి నరేష్, పిట్టల రమేష్, మున్సిపల్ సిబ్బంది మున్సిపల్ జవాన్లు, పరిశుద్య కార్మికులు పలువురు పాల్గొన్నారు.

## పక్కలోకోస్తే ఫామ్ హౌస్ రాసిస్తామన్నదేవరు..?

### ఎవరికి ఉన్నాయి ఫామ్ హౌస్ లు..?

### స్వేచ్ఛ సూసైడ్ పై "మైనంపల్లి" ఘాటు వ్యాఖ్యలు...

### మీడియా పై దాడికి పాల్పడితే వెంటపడి కొడతామని హెచ్చరిక

### ఆంధ్రా, తెలంగాణ సెంటిమెంట్ తెచ్చే ప్రయత్నం...



గజ్వేల్ నియోజక వర్గం తూప్రాన్ న్యూస్ :- మీడియాపై దాడి చేస్తే వెంటపడి కొడతామని, అవసరానికి అనుకూలంగా తెలంగాణను వాడుకుంటున్న బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి చెబుతామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. మనోహరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్ర విభేదాలు మళ్లీ తెరపైకి తెస్తున్నారని, పార్టీ సంక్షోభంలో పడగానే ఇవన్నీ గుర్తుకు వస్తున్నాయని విమర్శించారు. వ్యక్తులు, మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతూ బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూస్ రిపోర్టర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో ఫామ్ హౌస్ కి రావాలని, వస్తే ఫామ్ హౌస్ రాసిస్తా...అని ఎవరన్నారని, ఎవరికి ఫామ్ హౌస్ లు ఉన్నాయని హనుమంతరావు ప్రశ్నించారు. ఏబీఎన్ రాధాకృష్ణ తెలంగాణలో పుట్టిన నిజాంబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి అని, వారు తెలంగాణలో ఉండొద్దా..? ఎవరిని పడితే వాళ్ళని బెదిరిస్తారా..? అని నిప్పులు చెరుగారు. ఎబీఎన్, రాధాకృష్ణ మీడియాకు మా కార్యకర్తలు, మేము అండగా ఉంటామన్నారు. ఎవరైనా దాడులు చేస్తే బట్టలు ఊడదీసి ఉరికే దాకా కొడతాం అని హెచ్చరించారు. ఎప్పుడో బీహార్ నుంచి వచ్చిన రావులే సత్యమైన తెలంగాణ వాదులా..? మరి ఇక్కడ పుట్టిన వాళ్ళ పరిస్థితి ఏమిటన్నారు. మీ రాజ్యమా..? అంతా మీ ఇష్టమా..? అని బీఆర్ఎస్ నేతల తీరుపై ధ్వజమెత్తారు. ఈరోజు మీడియా ముందుకు వచ్చి చిల్లర మాటలు మాట్లాడుతూ ఎగురుతున్న బీఆర్ఎస్ నాయకులు, మరి ఆరోజు మీడియాకు ఆంక్షలు పెట్టిన విషయం గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణలో ఇంకా ఎన్ని ప్రయత్నాలు చేసినా బిఆర్ఎస్ పార్టీ ముందుకు రాదన్నారు.

## ఇంద్రకీలాద్రిపై శాకాంబరీ ఉత్సవాలు ప్రారంభం

బెజవాడ ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దుర్గమ్మను పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. 50 టన్నుల కూరగాయలు వినియోగించారు. శాకంబరి ఉత్సవాలు జూలై 10తో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక దర్శనాలు రద్దు చేశారు.

## మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలి...సత్యం శ్రీరంగం.

### ప్రతీ పేదవాడి గుండెల్లో గూడు కట్టుకున్న మహోన్నతమైన వ్యక్తి వైయస్ఆర్..



కూకట్పల్లి (ప్రజబలం) జులై :08 కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్ లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వైఎస్ రాజశేఖరరెడ్డి 76 వ జయంతి పురస్కరించుకొని ఘనంగా నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ , టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగ కేక్ కట్ చేసి, వైయస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన, అనంతరం రక్తదాన శిబిరంలో, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ వైఎస్ఆర్ ఎన్నికల్లో ఓటమి ఎరుగని మహానేత అని, రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని బలంగా నమ్మిన రైతు జన బాంధవుడు అని, ఆయన హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అమలు చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. 2003 లో రాష్ట్ర వ్యాప్తంగా మండుటెండలో దాదాపు 1450 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, పాద యాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకొని ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, నిరుపేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, ఇళ్ళు, ఇళ్ల స్థలాలు,పేద విద్యార్థులకు ఫీజు రీయంబర్సుమెంటు, రైతులకు రుణ మాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేటికీ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానాన్ని దక్కించుకున్నారని అన్నారు. ఆయన పేదల సంక్షేమమే లక్ష్యంగా తన ఆఖరి శ్వాస వరకు పరితపించిన జన హృదయ నేత అని, తను భౌతికంగా లేకపోయిన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఏకైక వ్యక్తి డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల అడుగుజాడల్లో ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ కార్పోరేటర్ దండుగుల యాదగిరి, ఏఎంసి చైర్మన్ పుష్పా రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, సంజీవ్ రావు, గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, జస్వంత్ రావు, సాధు ప్రతాప్ రెడ్డి, గూడెపు నాగరాజు, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, సీనియర్ మహిళా నాయకురాళ్లు జ్యోతి, స్వరూప గౌడ్, బండి సుధ, రేష్మా, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, కృష్ణ రాజ్ పుత్, మధు గౌడ్, మేకల రమేష్, తమ్మినేని ప్రవీణ్, మల్లికార్జున్ యాదవ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, అరవింద్ రెడ్డి, మాట్టే ప్రసన్న, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు రజిత, భారతమ్మ, గుండా జ్యోతి, %కావీజ% డైరెక్టర్లు ఫణికుమార్, జమీల్, అరుణ్ గౌడ్, పులి శివకుమార్ గౌడ్, కరుణాకర్ నాయుడు, కొప్పిశెట్టి దినేష్, మధు మోహన్, అనిల్ యాదవ్, సుంకన్న, విట్టల్ రెడ్డి, భరత్, పొడుగు అప్పారావు, మహేందర్, పల్లపు వేణు, కొండల్ రెడ్డి, జహంగిర్, జిట్టా సునీల్ యాదవ్, మేకల మైకేల్, అక్బర్, శేఖర్ గజానంద్, కలికోట మహేష్, బాల్ రాజ్, శంకర్, జల్లా శివ, నజీర్, జిబిన్, బాలయ్య, వైయస్ఆర్ అభిమాన సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భవిష్యత్తు నాయకుడు మైపాల్ రెడ్డి...

## పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మైనంపల్లి హనుమంతరావు....





మెదక్ న్యూస్ :-మెదక్ జిల్లా ప్రాంతానికి కాబోయే భవిష్యత్తు ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి మైపాల్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మంగళవారం నాడు రాష్ట్ర సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మైపాల్ రెడ్డి జన్మదిన సందర్భంగా కల్లకల్ నుండి నుండి మనోహరాబాద్ వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ తీసి గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఫంక్షనల్ కి చేరుకున్న మహిపాల్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మైనంపల్లి మాట్లాడారు. కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంజనేయులు గౌడ్, పాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, మన్నే ధర్మేందర్, జావేద్ భాషా, శశిభూషణ్ రెడ్డి, బిజెపి నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్, చంద్రశేఖర్ ముదిరాజ్, మైపాల్ రెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

## నల్లాల ఓదేలు కోలుకున్నందుకు

## మొక్కు తీర్చుకున్న వేటూరి



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 8: మాజీ ప్రభుత్వ విప్, చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఆయన పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా స్వస్థలమైన మందమర్రికి చేరుకున్నారు. అనారోగ్యానికి గురైన ఓదెలు సంపూర్ణ ఆరోగ్య వంతుడుగా కోలుకోవాలని కోరే గట్టు అంజనేయ స్వామికి మొక్కుబడి పెట్టిన వేటూరి సత్యనారాయణ తన మొక్కుబడి చెల్లించుకున్నారు. మంగళవారం రోజున కోరగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో "ఓదెన్న " పేరిట ప్రత్యేక అర్చనలు నిర్వహించి మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారా లింగన్న, ముంజం నరసయ్య, జెగ్రీగల రవి, బండారు సత్యనారాయణ, వాసాల శంకర్, సంఘీ సంతోష్, ఏర్పుల రవి, ఆవునూరి పోశం, తుంగపిండి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రహారం అంజన్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం.
## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

### అగ్రహారం అంజన్న ఆలయంలో 34.5 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం.
### రాజన్న, అంజన్న ఆలయాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు.
### 150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి.
### ప్రతి మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ నిర్మిస్తాం.
### హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.

**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని ఆంజనేయ స్వామి ఆలయం %ఽ% వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ప్రభుత్వం విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మార్బల్ ఫ్లోరింగ్ పనులు34.50 లక్షల సాండ్ ఫండ్ మంజూరు చేసి మంగళవారం రోజున భూమి పూజ



కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనంతరం శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కార్మికుల చట్టాల, హక్కుల పరిరక్షణ కోసం బుధవారం జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని పనిచేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికుల చట్టాల, హక్కుల పరిరక్షణ కోసం జూలై 9 తేదీ బుధవారం జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని బోయినపల్లి మండల సిఐటియు కన్వీనర్ గురజాల శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం రోజున బోయినపల్లి మండలం తడగొండ బీడీ కంపెనీ కార్మికుల ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్ విడుదల చేయడం జరిగింది. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గ హక్కులను కార్మికులను కట్టు బానిసలుగా చేసే విధానాలను అవలంబిస్తుందని ఆయన మండిపడ్డారు.

కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 లేబర్ కోడ్ లను గా తీసుకొచ్చి, కార్మిక హక్కులను కాల రాస్తుంది.

ఈ నాలుగు లేబర్ కోడ్ లు గా అమలు అయితే కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా, సమ్మె చేసే హక్కు లేకుండా, పని గంటల పెంపు, శ్రమ దోపిడి, కార్మికులకు భద్రత లేకుండా పోతుంది అన్నారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ జూలై 9 వ తేదీ బుధవారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని రంగాల్లో పనిచేస్తున్నటువంటి సంఘటిత, అసంఘటితరంగాల కార్మికులందరూ జిల్లా కేంద్రానికి ఉదయం 10 గంటలకు తరలివచ్చి సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మండల సిఐటి కన్వీనర్ గురజాల శ్రీధర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కన్వీనర్ గురజాల శ్రీధర్, మరియు బీడీ కార్మికులు మారుతి, ప్రవీణ్, పిట్టల అజయ్, గోలి మారుతి, కాల విజయ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగుకు సింగూరు జలాలు విడుదల చేసే అవకాశం

### కాలువ సీసీ పనుల నిలిపివేత
### ఏడాదిగా బ్రష్ కటింగ్ కే పరిమితం
### గత రెండు పంటలకు మొండి చేయి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 8 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా : మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయిన సింగూర్ ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయకుండా గత రెండు పంటలకు మొండి చేయి చూపిన అధికారులు, పై అధికారుల ఆదేశానుసారం ఈ వర్షాకాలం పంటకు సాగుకు నీరు ఇవ్వడానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదని, ప్రాజెక్టు అధికారి మహిపాల్ రెడ్డి, మాట్లాడుతూ, అయితే ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917, టీఎంసీలు కాగా, ప్రస్తుత ప్రాజెక్టు నీటి నిలువ, 18.618, టీఎంసీలుగా ఉందని , ప్రాజెక్టులోకి ఇంకా 4,5, టీఎంసీల నీరు వచ్చి చేరితే వారం 15 రోజుల్లో పంటసాగుకు ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, చొరవతో కాలువకు సీసీ పనులు చేయడానికి, రూ,168.30 కోట్ల నిధులు మంజూరు చేయగా, రూ, 138, కోట్లతో (సివెంట్ )అనే సంస్థ కాంట్రాక్టు దక్కించుకొని, కాల్వ పనులు ప్రారంభించింది, 8 నెలల నుంచి, కోటి, రూపాయల వరకు ఖర్చు చేసి కాలువకు బ్రష్ కటింగ్ మాత్రమే పూర్తి చేశారు, అటు కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు నెమ్మదించడం ఇటు పంటలకు సాగునీరు అందకపోవడంతో, అధికారులను నాయకులను రైతులు విమర్శించారు, అయితే ఇప్పుడు నీటిని విడుదల చేస్తామని అనడంతో రైతుల కళ్ళల్లో ఆనందం వెల్లి విరుస్తుంది...

## వైఎస్సార్ కు జగన్ నివాళి

కడప దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి సందర్భంగా వైఎస్సార్ తనయుడు, వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్రెడ్డి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఆయనతో పాటు తన తల్లి విజయమ్మ నివాళి ఘటించారు. ఈ జయంతి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వైఎస్సార్సీపీ నేతలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.



**దామెర మండల ప్రతినిధి( ప్రజాబలం ): జులై 8** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని రైతు వేదికలో దామర మండలం పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామాల వారి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే మంజూరైన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వారం రోజుల్లోగా ప్రారంభించకుంటే వారి మంజూరు ని రద్దు చేసి, అర్హత కలిగిన వారికి ఇస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై నిర్లక్ష్యం వహించవద్దని ప్రభుత్వం నిబంధనల మేరకు ఇండ్లు నిర్మించుకొని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు గృహప్రవేశం చేసి కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించేలా ప్రోత్సహించాలని అధికారులను కోరారు.

## ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి వేడుకలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 8:** స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి వేడుకలను మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా సీనియర్ నాయకులు సొతుకు సుదర్శన్, పైడిమల్ల నర్సింగ్ కేక్ కట్ చేసి ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైయస్సార్ ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకురావడం జరిగిందన్నారు. ఎల్లంపల్లి, జైపూర్ పవర్ ప్లాంట్, 108 రాజీవ్ ఆరోగ్యశ్రీ. ఫీజు రియంబర్స్మెంట్. ఇందిరమ్మ ఇల్లు, 200 రూపాయలు పెన్షన్. రేషన్ కార్డులు, పేదలకు 9 రకాల నిత్యవసర సరుకులు. ఉపాధి కల్పన. ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన ఘనత వైయస్ఆర్ దేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి సెల్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల శ్రీనివాస్, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సొతుకు ఉదయ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుడ్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మాయ తిరుపతి యాదవ్, సీనియర్ నాయకులు ఆలం శంకర్, గోగుల రాజయ్య, ఎర్ర రాజు, ముదారపు శేఖర్, విజయ్, షరీఫ్, రాచర్ల రవి, బీరం శ్రీనివాస్, పోలు సంపత్, రాకం సంతోష్, రంజిత్, నాంపల్లి వేణుగోపాల చారి, రాం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలి
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 08 :** ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం పెగడపల్లి,టేకుమట్ల గ్రామాలలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం-2025 కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,మండల తహశిల్దార్ వనజారెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుర్రం సత్యనారాయణ, విద్యార్థులతో కలిసి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటి వృక్షాలుగా అభివృద్ధి చెందితే వాతావరణ సమతుల్యత కాపాడటంతో పాటు భావి తరాలకు సహజ సిద్ధమైన మంచి పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయిలో సాధించే విధంగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెగడపల్లి గ్రామంలో 1000 మొక్కలు, టేకుమట్ల గ్రామంలో 600 మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు,వంటశాల, పరిసరాలను పరిశీలించి తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడి వారి పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో సకల సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్,మూత్రశాలలు, ప్రహారీగోడ,వంటశాల ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని,ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయంగా మారిన అంబేద్కర్ చౌరస్తా



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 8 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గం జోగిపేట మున్సిపాలిటీ పట్టణంలోని, అంబేద్కర్ చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది, జోగిపేట పట్టణం నుండి నలుమూలల నుండి పలు గ్రామాలకు వెళ్లాలంటే, ఇదే ప్రధాన చౌరస్తా,ఈ అంబేద్కర్ చౌరస్తా నుండి డాకురు వెళ్లే దారిలో ఆక్స్ఫర్డ్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కాన్రేడ్ హై స్కూల్, సిపిఎస్ స్కూల్, ఉన్నాయి, అన్న సాగర్, నుంచి డాకూర్, వెళ్లాలన్నా డాకూర్,నుంచి జోగుపేటకు రావాలన్నా జోగిపేట నుంచి పోసానిపేట,కు వెళ్ళాలన్నా ఇదే ప్రధాన చౌరస్తా అయితే ఈ స్కూల్లో ఆ విద్యార్థులు ఆడుకోవడానికి గ్రౌండ్ లేకపోవడంతో, విద్యార్థులు ఆడుకోవడానికి, జోగిపేట నుండి పోసానిపేట,వెళ్లే దారిలో ఉన్న గ్రౌండ్లోకి ఆడుకోడానికి వస్తు వెళ్తుంటారు, దీనివల్ల ప్రయాణికులకు పిల్లలకు చాలా ఇబ్బంది కలుగుతుంది, ఇది గమనించిన అధికారులు, గతంలో ఒక కానిస్టేబుల్ను అక్కడ ఉంచేవారు, ఇప్పుడా పరిస్థితి లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు, విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటారు కాబట్టి అధికారులు స్పందించి ఈ అంబేద్కర్ చౌరస్తావద్ద ఒక కానిస్టేబుల్ ను ఉంచి ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ ని కంట్రోల్ చేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు...

# రెండు లక్షల రుణమాఫీ చేసి చూపించాం.

## హాఫీజ్ మొల్సాబ్ అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ మెదక్.



**మెదక్ప్రజాబలం ప్రతినిధి:** రెండు లక్షలు రుణమాఫీ చేస్తానని ఎన్నికల ప్రచారం లో చెప్పిన రేవంత్ రెడ్డి అధికారం లో రాగానే మాట మార్చారాని తెరాస నాయకులు కేటీర్ ఆరోపించిందాన్ని తీవ్రంగా ఖండిస్తున్న మని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫిజ్ మొల్సాబ్ అన్నారు, అయన ఈ రోజు విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం లో రాగానే ఒకేసారి 21వేల కోట్ల రూపాయలు తో 25లక్షల రైతులకు రుణమాఫీ చేసిన ఘనత ప్రజాప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి చెందుతున్నదని హాఫిజ్ మొల్సాబ్ అన్నారు, మీకు దమ్ముంటే రుణమాఫీ కానీ వారి జాబితా బయట పెట్టాలని డిమాండ్ చేసారు, ఇప్పటికైనా దొంగ నాటకాలు, డ్రామాలు ఆపాలని అన్నారు, లేకుంటే మిమ్మల్ని దునియా లో ఎవరు నమ్మరు అని అన్నారు.

## జనం గుండెల్లో చిరస్థాయి గా నిలిచిన మహానాయకుడు డాక్టర్ వైస్ రాజశేఖరరెడ్డి

### జయంతి కార్యక్రమం లో పాల్గొన్న మేకల మల్లిబాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి జులై 8 (ప్రజాబలం)** ఇల్లందు నియోజకవర్గం రాజకీయాలు వర్గాలకతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం అందించి జనం గుండెల్లో మహా నేతగా చిరస్థాయిగా ఒక దేవుడిగా, పేద ప్రజల పెన్నిధిగా నిలిచిపోయిన మహానుభావుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతిని పురస్కరించు కొని కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో వేడుకలు మల్లి బాబు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పండితాపురం బస్టాండ్ సెంటర్ లోఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహం ను శుభ్రపరచి, కొత్తగా రంగులు వేయించి అలంకరణ చేయడం జరిగింది. మంగళవారం నాడు జరిగిన జయంతి సందర్భంగా మల్లి బాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫతే మహమ్మద్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. తదనంతరం కేక్ కట్ చేసి ఆనందోత్సాహల మధ్య స్వీట్లు పంచారు . ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలించిన కాలం స్వర్ణ యుగము గా నిలిచిపోయిందని, వారు ప్రవేశపెట్టిన పథకాలు దేశ చరిత్రలో అంతకుముందు ఎవరు ప్రారంభించలేదని, 108 104, ఆరోగ్యశ్రీ, పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, రైతులకు ఉచిత విద్యుత్తు



రూపాయికి కిలో బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల పథకం, జల యజ్ఞం కార్యక్రమంలో 86 ప్రాజెక్టుల నిర్మాణం లాంటి సంక్షేమ పథకాలు ఈ దేశానికి స్ఫూర్తిగా నిలిచిపోయాయని, ఆ పథకాలను దేశమంతటా కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా కొనసాగించడం జరిగిందని మల్లి బాబు యాదవ్ తెలిపారు. 2003 వరకు వరుస ఓటములతో ఉన్న కాంగ్రెస్ పార్టీని నట్ట నడిమి ఎండను సైతం లెక్కచేయకుండా దాదాపు 1600 కిలోమీటర్లు పాదయాత్ర చేసి, కరువు తో అల్లాడుతున్న ప్రజలను, నిరుద్యోగ వ్యవస్థను, విద్యుత్ సమస్యతో అల్లాడుతున్న రైతులను, డబ్బులు లేక ఉన్నత చదువు చదవలేని విద్యార్థులను, ఉండటానికి ఇల్లు లేని నిరుపేదలను చూసి చలించి పోయిన ఆ మహానుభావుడు కాంగ్రెస్ పార్టీకి తాను ఒక్కడే అంతా అయి కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో కేంద్రంలో, వరుసగా రెండుసార్లు గెలిపించి ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా అధికారంలోకి వచ్చిన

తక్షణమే రైతులకు ఉచిత విద్యుత్తు ఫైల్ పై సంతకం పెట్టిన జనహృదయనేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని గుర్తు చేశారు. వైయస్సార్ పాలన కు ముందు ఏడు సంవత్సరాల పాటు వర్షాలు లేక కరువు కాటకాలతో అల్లాడిపోయిన మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజన్న కాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండి రైతులు కూలీలు సంతోషంగా జీవించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భానోత్ నరసింహ నాయక్, మద్దినేనిబాలగోపాల్, దొడ్డ శ్రీనివాస్, భూక్యా నాగేంద్రబాబు పాడిబ%శీ%డ్ల ప్రసాదు, చల్ల మల్లయ్య ఎస్కే రబ్బానీ పాషా జక్కంపూడి వెంకటేశ్వర్లు, నాగండ్ల జగ్గయ్య మొగిలి శ్రీను గుగులోత్ రవి, మేకల లక్ష్మీనారాయణ, బాదావత్ నాగరాజు, శీలం పుల్లయ్య జలగం శ్రీను, రాయల నాగ శంకర్ గుగులోత్ కిషన్ కొమ్మినేని అప్పారావు, బండి ఎల్లయ్య, బి దాన్య, గుగులోత్ కిషన్, హరిదాసు బొగ్గరపు రామచంద్రయ్య, బండి నాగేశ్వరరావు మరియు తదితరులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు

## కే.టీ.ఆర్ కు మద్దతుగా తరలిన మణికొండ నాయకులు.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 8 జూలై 2025.** తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేసిన సవాలును ధీటుగా స్వీకరించిన కల్వకుంట్ల తారక రామారావుకు మద్దతుగా, బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పట్లొల్ల కార్తీక్ రెడ్డి పిలుపు మేరకు తెలంగాణ భవనుకు తరలి వెళ్ళిన మణికొండ మున్సిపాలిటీ నాయకులు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, గోరుకంటి విఠల్, సుమనలిని, మహేశ్వరం సుమన్, కందాడ ప్రవీణ్, తిరుపతి, రవి సాగర్ తది తరులు.

# ఇబ్బందిగా మారిన అంబేద్కర్ చౌరస్తా



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 8 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: అందోల్ నియోజకవర్గం జోగిపేట మున్సిపాలిటీ పట్టణంలోని, అంబేద్కర్ చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది, జోగిపేట పట్టణం నుండి నలుమూలల పలు గ్రామాలకు వెళ్లాలంటే, ఇదే ప్రధాన చౌరస్తా,ఈ అంబేద్కర్ చౌరస్తా నుండి డాకురు వెళ్లే దారిలో ఆక్స్ఫర్డ్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కామ్రేడ్ హై స్కూల్, సిపిఎస్ స్కూల్, ఉన్నాయి, అన్న సాగర్, నుంచి డాకూర్, వెళ్లాలన్నా డాకూర్,నుంచి జోగుపేటకు రావాలన్నా జోగిపేట నుంచి పోసానిపేట,కు వెళ్ళాలన్నా ఇదే ప్రధాన చౌరస్తా అయితే ఈ స్కూల్లో ఆ విద్యార్థులు ఆడుకోవడానికి గ్రౌండ్ లేకపోవడంతో, విద్యార్థులు ఆడుకోవడానికి, జోగిపేట నుండి పోసానిపేట,వెళ్లే దారిలో ఉన్న గ్రౌండ్లోకి ఆడుకోడానికి వస్తు వెళుంటారు, దీనివల్ల ప్రయాణికులకు పిల్లలకు చాలా ఇబ్బంది కలుగుతుంది, ఇది గమనించిన అధికారులు, గతంలో ఒక కానిస్టేబుల్ను అక్కడ ఉంచేవారు, ఇప్పుడా పరిస్థితి లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు, విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటారు కాబట్టి అధికారులు స్పందించి ఈ అంబేద్కర్ చౌరస్తావద్ద ఒక కానిస్టేబుల్ ను ఉంచి ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ ని కంట్రోల్ చేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు...

## ఫోటో స్టూడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల పండుగ

### బాధితులకు కుటుంబ భరోసా చెక్కులను అందజేసిన రాష్ట్ర నాయకులు



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి జులై 08(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా: /** సదాశివపేట పట్టణంలో ఆషాఢమాసం సందర్భంగా ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుల విజయకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు,ఉదయం అమ్మవారికి నైవేద్యాల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు,అమ్మవారిని అందరిని చల్లగా చూడాలని వేడుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్ లో ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ సమావేశం నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రఫీ సంక్షేమ సంఘం కోశాధికారి మాధవరెడ్డి, జిల్లా అధ్యక్షులు సుప్పాల శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి దాసరి శ్రీధర్,లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కుటుంబ భరోసా బాధితులు సామల రవికుమార్ కుటుంబ సభ్యులకు రూ 1,60,000 చెక్కును అందజేశారు, అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబ భరోసా ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు,ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బిట్ల రాజు,పట్టణ ప్రధాన కార్యదర్శి జయచింతన్, కోశాధికారి కరుణాకర్,నాయకులు శ్రీనివాస్, మహేష్, శ్రీకాంత్, రుమాండ్ల రాజు,బండారి పాండు, మల్లేశం సత్యనారాయణ, వివిధ మండల, పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** మంగళవారంనాడు హైదరాబాద్ బోనాల ఉత్సవాల సందర్భంగా చాదర్ఘాట్ చౌరస్తాలోని శ్రీ రేణుకా ఏలమ్మమాత మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాకేష్ జైస్వాల్ కార్పొరేటర్ జాంబాగ్ డివిజన్, తెలంగాణాఓబీసీ కోఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్, అరెలి అంజయ్య, అరేలి సుదర్శన్ లను మందిర నిర్వాహకులు శాలువ కప్పి సన్మానించడం జరిగినది.

## వైఎస్సార్ కు నివాళులర్పించిన వైఎస్ షర్మిలా

కడప మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ 76 వ జయంతి సందర్భంగా ఇడుపుల పాయ ఘాట్ వద్ద ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఘన నివాళులు అర్పించారు. షర్మిలా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మెమోరియల్ హైదరాబాద్ లో సైతం ఉండాలి. ఏఐసిసి అగ్రనేత సోనియా గాంధీ,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశా. రేవంత్ రెడ్డి, వైఎస్సార్ మెమోరియల్ ఏర్పాటుపై చొరవ చూపాలని కోరుతున్ననని అన్నారు.

వైఎస్సార్ ఉమ్మడి . రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రెండు సార్లు పని చేశారు. రాష్ట్రంలో నే కాదు దేశంలోనే అధికారంలో కాంగ్రెస్ అధికారంలో రావడంలో వైఎస్సార్ కీలకం. పరిపాలన, పథకాలతో కోట్ల మందిని తాకారు. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్, జలయజ్ఞం లాంటి పథకాలు అయన మార్క్. వైఎస్సార్ చనిపోతే ఆయన వెనకాలే 700 మంది ప్రాణాలు వదిలారు. వైఎస్సార్ జయంతులకు,వర్ధంతులకు నివాళులు అర్పించేందుకు మెమోరియల్ ఉండాలి. రేవంత్ అన్న సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్ననని అన్నారు.

# ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిపిన నేత వైయస్సార్.

## వైయస్సార్ జయంతి సందర్భంగా నివాళు లర్పించిన, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ),** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బస్టాండులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా వైయస్సార్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 108,104, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ అంటే టక్కున గుర్తుకు వచ్చే పేరు వైయస్సార్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, పావలా వడ్డీకే రుణాలు, జలయజ్ఞం సహా ఎన్నో పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి అన్నారు. వైయస్సార్ పాదయాత్రతో 2004 లో ఇండియన్ కాంగ్రెస్ ని అధికారంలోకి తెచ్చి, పథకాలతో2009 లో రెండవసారి సీఎం అయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుడిసే ఐలయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మానకొండూరు నియోజకవర్గం అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మామిడి సంజీవ్, తీగల పుష్పలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామస్వామి, మామిడి రాజు, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రజనీకాంత్, నవీన్ రెడ్డి, గొడుగు నరసయ్య, యాస తిరుపతి, మామిడి నరేష్, ప్రదీప్, బాలరాజు, ఉస్మాన్, సురేందర్ రెడ్డి, మాధవరెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** మంగళవారంనాడు నాంపల్లి గాంధీభవన్‌లో మాజీ ముఖ్యమంత్రి డా॥ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా డా॥ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పఠానికి పూలమాళవేసి ఘనంగా నివాళుర్పించిన తెలంగాణాఓబీసీ కోఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్, క్రిష్ణ కూమార్ జానకిరాం ,బాలపోచయ్య తదితరులు

# ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా.

## ప్రజలను,ప్రభుత్వ నిధులను దోచుకోవడమే కాంగ్రెస్ నైజం. కాంగ్రెస్ పాలనలో మానకొండూర్ అభివృద్ధి శూన్యం. మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం),** ఇల్లంతకుంట మండలం కొత్తూరు నుండి గుండ్లపల్లి వరకు, బెజ్జంకి నుండి బేగంపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని తేదీ 12-07-2025 శనివారం రోజున ఉదయం 10 గంటలకు చలో బైక్ ర్యాలీని బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువకులు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని మంగళవారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లె నరసింహారెడ్డి అధ్యక్షతన మానకొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ప్రజల మధ్యన ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. ప్రజలను, ప్రభుత్వ నిధులను దోచుకోవడమే కాంగ్రెస్ నైజం అని అన్నారు. ఆనాడు మానకొండూరు నియోజకవర్గ అభివృద్ధి కొరకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు సహకారంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కోట్ల రూపాయల నిధులు తీసుకొస్తే వాటిని నేడు అన్ని క్యాన్సిల్ చేసి అభివృద్ధిని గంగలో కలిపింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బెజ్జంకి మాజీ ఎంపీపీ లింగాల నిర్మల- లక్ష్మణ్, బెజ్జంకి టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మైపాల్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఫిష్షరీస్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ కు వినతిపత్రం ఇచ్చిన బద్దం సతీష్‌గౌడ్



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ నియోజకవర్గం లోని సమస్యలు పరిష్కారం చేయాలి, చైర్మన్ మెట్టు సాయి కుమార్ కు వినతిపత్రం అందించిన బద్దం సతీష్‌గౌడ్. గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుల తరఫున నియోజకవర్గం లోని ముఖ్యమైన ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలనీ వినతిపత్రం లో కోరడమైనది. 1.నియోజకవర్గం లో మేము గుర్తించిన అతి పేద నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపుకు సహకరించాలని జాబితా సమర్పించడం జరిగింది. 2.కబ్జాకు గురైన సూర్యమహల్ ప్రాంతంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని వినపించడం జరిగింది. 3.గంఫొంఢ్రి డివిజన్ ఈసమియా బజార్ లోని గుర్తించిన ప్రభుత్వ స్థలంలో అంగన్వాడీ కేంద్రం మంజూరు చేస్తూ నిర్మాణం చేపట్టాలని కోరడమైనది. 4.బోనాల ఉత్సవాలు సందర్బంగా తగు సౌకర్యాలు భక్తులకు, మరియు దేవాలయాల వద్ద కల్పించాలని విన్నవించడం జరిగింది చైర్మన్ మెట్టు సాయి కుమార్ స్పందించి అన్ని సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, బద్దం సతీష్ గౌడ్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కన్వినర్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్, ఇఫతేఖర్ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు ఆరీఫ్ , ఘోస్ ఉద్దీన్, ఇస్మాయిల్, నవీన్ గౌడ్,అఫ్రోజ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు చేతన్,తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆలయ ఈవో పై దాడిని ఖండించిన, రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం నేతలు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** భద్రాచలం పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి చెందిన పురుషోత్తపట్నం గ్రామంలోని దేవస్థాన భూములను పరిరక్షించేందుకు వెళ్లిన భద్రాచలం ఆలయ కార్య నిర్వహణ అధికారి రమాదేవి, అర్చకులు మరియు సిబ్బందిపై జరిగిన దాడిని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వేములవాడ ఉద్యోగుల యూనియన్ తరపున తీవ్రంగా ఖండించారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులపై దాడులు జరగడం తీవ్ర ఆవేదనను కలిగిస్తుందని. ఆలయ భూములను పరిరక్షించేందుకు కృషి చేస్తున్న అధికారులకు ఇదొక నిరుత్సాకర పరిణామం అన్నారు. ఇటువంటి దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వేములవాడ దేవస్థానం యూనియన్ తరపున డిమాండ్ చేశారు. అలాగే ఆలయ భూములను పరిరక్షించేందుకు కార్యాచరణలో ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్, ఏ ఈ ఓ లు, పర్యవేక్షకులు, అర్చకులు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది , వేద పండితులు మరియు మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిలోవైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

తిరుపతి తుడా కార్యాలయ ప్రాంతం లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైసిపి శ్రేణులు, కార్యకర్తలు పూలమాలలు వేసి , భారీ కేక్ ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, నగర మేయర్ శిరీష, తిరుపతి జిల్లా యూత్ ఇంచార్జ్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొన్నారు.

# వేములవాడ పట్టణంలో కలెక్టర్ ఆదేశాలతో అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై కొరడా.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మంగళవారం రోజున వేములవాడ పట్టణంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న పలు ప్రైవేట్ పాఠశాలలపై రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. గతంలో పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందన లేకపోవడంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశాలతో ప్రైవేట్ పాఠశాలలపై దాడులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లా ఇన్చార్జి విద్యాధికారి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బృందం పాఠశాలల పరిశీలించడానికి వెళ్ళిన సమయంలో, పాఠశాల యజమాన్యాలు అడ్డుకొని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అనుమతుల కోసం చాలాకాలంగా దరఖాస్తులు చేసిన సంబంధిత శాఖల నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతోనే తమ పాఠశాలలు యధావిధిగా కొనసాగుతున్నాయని యజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా డిఇఓ వినోద్ కుమార్ మాట్లాడుతూ 24 గంటల్లోగా సంబంధిత పత్రాలు సమర్పించకపోతే, పాఠశాలలను సీజ్ చేయడమే కాక, చట్టపరంగా చర్యలు తీసుకుంటాం అని ఆయన హెచ్చరించారు. విద్యారంగంలో సమాచార పారదర్శకత, నిబంధన కనుగుణంగా మాత్రమే పాఠశాలలు నడవాలి అన్నారు. ఈ దాడుల్లో మండల విద్యాధికారి బన్నాజీ, టౌన్ ప్లానింగ్ అధికారి అభినవ్, పట్టణ సీఆర్పీలు శ్రీనివాస్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

నూతన సంవత్సరంలోపు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి.

76 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు.

అగ్రహారం శ్రీ ఫంక్షన్ హాల్ లో మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్.









**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మిడ్ మానేరు రిజర్వాయర్ ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూస్తున్నమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి వేములవాడ అగ్రహారం వద్ద గల శ్రీ ఫంక్షన్ హాల్ లో మిడ్ మానేరు రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇల్లు కట్టుకొని ఖాళీ ప్లాట్స్ ఉన్నవారికి స్పెషల్ కోట కింద 847 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నాలుగు లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో మంజూరు చేశామని, వీటిలో వేములవాడ నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇళ్లను ఇప్పటికే పంపిణీ చేశామని, స్పెషల్ కోట కింద మిడ్ మానేరు నిర్వాసిత గ్రామాల ప్రజలకు మంగళవారం రోజున847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు పంపిణీ చేస్తున్నామని, మరో మూడు వేల ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పెండింగ్ విచారణలో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో మిగిలిన వారికి తప్పనిసరిగా ఇండ్ల మంజూరు చేస్తామని అన్నారు.

వేములవాడ అర్బన్ ప్రాంతంలోని ముంపు గ్రామాల రిజర్వాయర్ నిర్వాసితులకు తప్పనిసరిగా ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా మనమంతా సంయుక్తంగా పనిచేయాలని అన్నారు. భారతదేశంలో ఎక్కడ కూడా పేదలకు ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఖర్చు చేయడం లేదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రమే పెద్ద ఎత్తున పేదలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు.

76 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందన్నారు. ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ప్రభుత్వ విప్ ధ్వజమెత్తారు.

ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయాంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షల రూపాయలకు పెంపు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకాలను ప్రారంభించామని గుర్తు చేశారు.

వైయస్సార్ జయంతి సందర్భంగా ఆయన ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఫీజు రియంబర్స్మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. పేదలు చాలాకాలంగా ఎదురుచూస్తున్న నూతన రేషన్ కార్డుల జారీ చేస్తున్నామని అన్నారు.

500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల వరకు పంట రుణమాఫీ, సన్న వడ్ల కు క్వింటాలకు 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40 శాతం డైట్ చార్జీలు, 200% కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు రాజీవ్ యువ వికాస పథకం కింద వ్యాపార యూనిట్లు ప్రత్యేకంగా మంజూరు చేసేలా కృషి చేస్తామని ప్రభుత్వ విప్ తెలిపారు. పేదల పట్ల కారుణ్యంతో జిల్లా కలెక్టర్ పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్ ప్రశంసించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ స్టేట్ రిజర్వ్ నుంచి మొట్టమొదటిసారిగా 5000 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ విప్ మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వ విప్ ప్రత్యేక చొరవతో మంజూరు చేయడం జరిగిందన్నారు.

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నాలుగు దశలలో ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందుతుంది అన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తర్వాత రెండు లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 నుంచి 600 చదరపు గజాల లోపు మాత్రమే నిర్మించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 600 చదరపు గజాలకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే చెల్లింపులలో ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. అమ్మ నాన్న చనిపోయిన కేసులలో పిల్లలకు ఆ ఇల్లు వచ్చేలా చూస్తామని అన్నారు. మంగళవారం రోజున 847 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరి చేస్తున్నామని, మీరు కొత్త సంవత్సరంలోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, నాయకులు, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు.

ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన విప్.

భారీ సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.






**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** మంగళవారం రోజున వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మహానేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివి అన్నారు. ఆనాడు ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలకు ఉపయోగపడే అనేక పథకాలను ఆయన అందించారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ దేశ ప్రధానమంత్రిగా చేయాలని ఆయన సంకల్పించారు అని పేర్కొన్నారు. వైయస్సార్ ను నేను రాజకీయ గురువుగా, ఆయన నన్ను ప్రియ శిష్యుడుగా భావించేవారు అని తెలిపారు. 2005 సంవత్సరంలో మన ప్రాంతంలో ఎత్తిపోతల పథకం కోసం అంకురార్పణ చేశారని తెలిపారు. మల్యాల గ్రామంలో ప్రజా పతం సభలో 1737 కోట్లతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి రుద్రంగి కలికోట చెరువు వరకు ప్రాజెక్టు శంకుస్థాపన చేశారని తెలిపారు. మొన్నటి రోజున వేములవాడలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 కోట్లతో శంకుస్థాపన చేసినట్లు, ఆనాడు మల్యాల గ్రామంలో శంకుస్థాపనల జాతర జరిగిందన్నారు. ఆనాడే చందుర్తి చెరువు - రుద్రంగి, నాగారం రిజర్వాయర్, పూర్తి చేయడం జరిగిందన్నారు. వేములవాడలో 9 కోట్లతో ఎల్ఎండి నుండి నాంపల్లి వరకు నీరు అందించారని తెలిపారు. రాజన్న భక్తులకు వేములవాడ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూశారన్నారు. మన ప్రాంతంలో ఏకకాలంలో నాలుగు జూనియర్ కళాశాల మంజూరు చేసిన ఘనత వైయస్సార్ ది అన్నారు. అగ్రహారంలో సైన్స్ వింగ్ లో కార్పస్ ఫండ్ లేకుండా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మన ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. వైయస్సార్ మన ప్రాంతానికి అందించిన సహకారం మరువలేనిది అన్నారు. ఎందరో పేద కుటుంబాలకు అనేక పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాడు అని తెలిపారు. ఫీజు రియంబర్స్మెంట్, ఆరోగ్యశ్రీ పథకం, 108 అంబులెన్స్ వంటి ఎన్నో చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని తెలిపారు. ఆయన బాటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. వైయస్సార్ చిరకాల కోరిక రాహుల్ గాంధీని ప్రధానమంత్రి గా చేయడమే లక్ష్యంగా పనిచేయాలి అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ కాంగ్రెస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, సాగరం వెంకటస్వామి, బింగి మహేష్, నాగుల విష్ణు ప్రసాద్, తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

మృతుడు గర్దాస్ ప్రసాద్ కుటుంబానికి టి యు డబ్ల్యు జె హెచ్ 143 అండగా ఉంటుంది.

సంతాప సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన టివి 9 రిపోర్టర్ గర్దాస్ ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. కడుపేదరికంతో కొట్టుమిట్టాడుతున్న పేద జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సంతాప సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్దాస్ ప్రసాదు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం లాయక్ పాషా, మహమ్మద్ రఫీలు మాట్లాడుతూ జర్నలిజాన్ని వృత్తిగా ఎన్నుకొని జీవనాన్ని కొనసాగిస్తున్న ప్రసాద్ అకాల మరణం జర్నలిస్టు లోకానికి తీరని లోటు అన్నారు. మృతుడు ప్రసాద్ కుటుంబానికి ప్రభుత్వం, టీవీ9 యాజమాన్యం ఆర్థిక సాయం అంద చేసి ఆదుకోవాలని కోరారు. నిలువ నీడలేని ప్రసాద్ కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ ద్వారా తక్షణమే లక్ష రూపాయల సహాయం, మృతుడి భార్యకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మృతుడి కుటుంబానికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అల్లం నారాయణ, మారుతి సాగర ల ఆధ్వర్యంలో అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు రేగుల రాము, టెంజు జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి జితేందర్రావు, జర్నలిస్టులు దేవరకొండ ప్రసాద్, పంపరి నాగరాజు, ఇమ్రాన్, సయ్యద్ అలీ, జింక శ్రీధర్, రాము, పాశం భాస్కర్ రెడ్డి, లతోపాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధిపై కమిటీ సమావేశం



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి జూలై 8** ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానము లో మంగళవారం రోజున ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు అధ్యక్షతన దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె. సుధాకర్ సాధారణ సమావేశము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానముకు చేయవలసిన పలు అభివృద్ధి పనులపై చర్చించడం జరిగినది. చైర్మెన్ ఇంగిలే రామారావు ఆలయములో భక్తుల సౌకర్యార్థం మినరల్ వాటర్ సప్లై టూరిజం గదులు మరమత్తు, రూర్బన్ పథకం ద్వారా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదుల ప్రారంభం ఆలయము లోపల అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రైన్ నిర్మాణం కొత్తపల్లి క్రాస్ రోడ్ దగ్గర ఆర్చి గేటు నిర్మాణము గురించి సంభందిత దేవాదాయ శాఖ అధికారులకు తగు లేఖలు పంపవలసినదిగా పలు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు రవికిరణ్, పరమేశ్వర్, శ్రీనివాస్, కిషన్ రెడ్డి, రాజేందర్, చిరంజీవి, మల్లేష్, రాంరెడ్డి, గోపాల్ రెడ్డి, నారాయణ రెడ్డి, మధూకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, నాగరాజు మరియు దేవస్థాన అర్చకులు-సిబ్బంది శ్రీ శేషం వంశీధరాచార్యులు, శ్రీ మడికొండ నవీన్ శర్మ, మోహన్, మల్లారెడ్డి, సురేందర్ రావు, ప్రవీణ్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై దాడితో మాకు సంబంధం లేదు: టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడి ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రస్తుత ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. దాడులు చేసే సంస్కృతి తమది కాదని, ప్రసన్నకుమార్ రెడ్డి వల్ల గతంలో ఎంతోమంది తీవ్రమైన బాధలు అనుభవించారని, వారిలో ఎవరో ఈ దాడికి పాల్పడి ఉండవచ్చని ఆమె వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై తనపై వస్తున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు.

ప్రసన్నకుమార్ రెడ్డి తనపై వ్యక్తిగతంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను వైసీపీ నేతలు తమ ఇంట్లోని మహిళలకు చూపించగలరా అని ఆమె ప్రశ్నించారు.

ఒక మాజీ ఎమ్మెల్యే అయి ఉండి మహిళపై అలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఈ విషయాన్ని వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా పరిగణించి ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రశాంతి రెడ్డి డిమాండ్ చేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com